WANTED
స్టాఫ్ రిపోర్టర్లు & విలేకర్లు కావలెను
చిత్తూరు, తిరుపతి, నెల్లూరు జిల్లాలు ప్రధాన కేంద్రంగా వెలువడుతున్న
స్వర్ణసాగరం దినపత్రికలో
పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలలో రిపోర్టర్లు
జిల్లా కేంద్రాలలో స్టాఫ్ & రిపోర్టర్లు కావలెను
ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణాలు రాయగల సామర్థ్యం ఉండాలి, అనుభవం, అర్హతను భట్టి ప్రాధాన్యత ఇవ్వబడును
సంప్రదించండి : 94403 52036,9949329705

మా కలం - సామాన్యుడి బలం

# స్వర్ణసాగరం

RNI: APTEL/2020/79173 జాతీయ తెలుగు దినపత్రిక
www.swarnasagaram.com

ఆంధ్రప్రదేశ్ తెలంగాణ | సంపుటి : 6 | సంచిక : 51 | పేజీలు : 8 | ఎడిటర్ : డా.దామా విజయ్‌కుమార్ | మంగళవారం 24 ఫిబ్రవరి 2026 | వెల : 2-00




తమిళనాడులో 74 లక్షల

## ఓట్లు తొలగింపు

- తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలకు మోగనున్న ఎన్నికల నగారా
- ప్రత్యేక సమగ్ర సవరణ అనంతరం తుది ఓటర్ల జాబితాను విడుదల చేసిన ఎన్నికల సంఘం
- పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికం

2



## బంగాల్‌లో అధికార మార్పు తీసుకురావాలి

- ఆ రాష్ట్ర ప్రజలకు మోదీ లేఖ
- త్వరలో బంగాల్ అసెంబ్లీ ఎన్నికలు
- ఈ నేపథ్యంలో బంగాల్ ప్రజలకు ప్రధాని మోదీ లేఖ
- బంగాల్‌లో అధికార మార్పు తీసుకురావాలని పిలుపు

## తితిదేలో తప్పు చేసిన వారిపై క్రిమినల్ చర్యలు

- స్వర్ణ దేవాలయం తరహాలో చట్టం తెచ్చే యోచన
- కల్తీ నెయ్యిపై శాసనసభలో నేడు 10.30 నుంచి 2 గంటల వరకు చర్చ

అమరావతి, స్వర్ణసాగరం

తితిదేలో కల్తీ నెయ్యి సరఫరా వంటి అపచారాలు ఇకపై జరగకుండా, తప్పు చేసిన వారిని కఠినంగా శిక్షించేలా నిబంధనల్ని మరింత తీవ్రతరం చేయాలని రాష్ట్రప్రభుత్వం భావిస్తోంది. తప్పు చేసిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకునేందుకు అవసరమైతే ప్రత్యేకచట్టం తేవాలన్న యోచనలో ఉంది. అమృత్‌సర్‌లోని స్వర్ణ దేవాలయానికి ప్రత్యేక చట్టం ఉందని, అదే తరహాలో తితిదేకి చట్టం తెచ్చేందుకు ఉన్న అవకాశాల్ని అధ్యయనం చేయాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. సోమవారం ఉదయం శాసనసభలోని తన ఛాంబర్‌లో కొందరు మంత్రులు, సీఎంఓ అధికారులతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. తిరుమల శ్రీవారి ఆలయంలోకి అన్యమతస్తులు ప్రవేశించాలంటే డిక్లరేషన్ ఇవ్వడం తప్పనిసరి చేస్తూ.. నిబంధనల్లో మార్పులు చేయాలన్న నిర్ణయానికి వచ్చారు. - మిగతా 2లో



# బాగా పనిచేసే ఉద్యోగులకు వెయిటేజ్



అభినందన లేఖలతోపాటు, వారి వ్యక్తి గత రికార్డుల్లో నమోదు

రెవెన్యూశాఖకు ఉన్న చెడ్డపేరు పోవాలి.. ఏసీబీని క్రియాశీలం చేసే పరిస్థితి తెచ్చుకోవద్దు

ఆసుపత్రుల పారిశుద్ధ్యంలో అశ్రద్ధ చూపితే ఏజెన్సీలు, ఏవోలే బాధ్యులు

వివిధ శాఖల పనితీరుపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడి

అమరావతి, స్వర్ణసాగరం

బాగా పనిచేసే ఉద్యోగులను గుర్తించి వారిని ప్రోత్సహించేలా అభినందన లేఖలు పంపేలా అన్నిశాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. అలాగే ఆయా ఉద్యోగుల వ్యక్తిగత రికార్డుల్లో వాటిని నమోదు చేయాలన్నారు. పనితీరు ఆధారంగా ఉద్యోగులకు వెయిటేజ్ ఇవ్వాలని ఆదేశించారు. సరిగా పనిచేయని వారిని మోటివేట్ చేయడంపై దృష్టిపెట్టాలని సూచించారు. సీఎం సోమవారం సచివాలయంలోని ఆర్టీజీఎస్ నుంచి వివిధ శాఖల పనితీరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో బాగా పనిచేసే ఉద్యోగులను గుర్తించి, ప్రోత్సహిస్తే బాగుంటుంది అంటూ సీఎం చేసిన సూచనపై అధికారులంతా.. చాలా మంచి నిర్ణయమని పేర్కొన్నారు. ఉద్యోగులను అభినందించడం ఇదే తొలిసారి అవుతుందని అభిప్రాయపడ్డారు. ఉద్యోగుల్లో పోటీతత్వం కూడా పెరుగుతుందన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన సేవలు అందించడం, ప్రభుత్వ సేవలను సులభతరం చేయడమే లక్ష్యంగా ఉద్యోగులు, అధికారులు పనిచేయాలని పేర్కొన్నారు. ఇంకా - మిగతా 3లో

## స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే బీసీ రిజర్వేషన్ల పెంపు

- ఏకసభ్య కమిషన్ నివేదిక రాగానే చట్టం చేసి అమలు చేస్తాం
- ఇది బలహీనవర్గాల ప్రభుత్వం
- శాసనసభలో సీఎం చంద్రబాబు

# రెడ్‌బుక్ రివర్స్.. బిహార్‌లో బేజార్!

- బిహార్ ఐజీ సునీల్ నాయక్‌ను కిడ్నాప్ చేసేందుకు ఆయన ఇంటి వద్దకు అక్రమంగా చేరుకున్న ఏపీ పోలీసులు
- పట్నాలో తెల్లవారుజామున ఎస్పీ దామోదర్ బృందం అరాచకం
- గిరిజన ఐపీఎస్ అధికారి సునీల్ నాయక్ అక్రమ అరెస్టుకు బరితెగింపు
- గోడ దూకి చొరబడి కిడ్నాప్ చేసి తీసుకువెళ్లే యత్నం
- ఏపీ పోలీసులను అడ్డుకున్న బిహార్ పోలీసులు..
- గంటలపాటు వాగ్వాదం... ఉద్రిక్తత



అమరావతి, స్వర్ణసాగరం

చంద్రబాబు సర్కారు రెడ్‌బుక్ అరాచకాలకు బిహార్ గడ్డ ఘాటుగా బుద్ధి చెప్పింది! రెడ్‌బుక్ రాజ్యాంగ వేధింపులను బిహార్‌లో కూడా అమలు చేసేందుకు బరితెగించిన ఏపీ పోలీసులు ఘోర పరాభవానికి గురయ్యారు. ప్రస్తుతం బిహార్‌లో విధులు నిర్వహిస్తున్న గిరిజన ఐపీఎస్, ఐజీ స్థాయి అధికారి సునీల్ నాయక్‌ను అక్రమంగా అరెస్టు చేసేందుకు అక్కడకు వెళ్లిన సీఎం చంద్రబాబు సామాజిక వర్గానికి చెందిన ఎస్పీ దామోదర్ తన బృందంతో కలసి బీభత్సం సృష్టించారు. సోమవారం తెల్లవారుజామున పట్నాలోని సునీల్ నాయక్ నివాసం గోడదూకి మరీ ఎస్పీ దామోదర్ బృందం కిడ్నాపర్ల మాదిరిగా చొరబడటం తీవ్ర విభ్రాంతికి గురి చేసింది. ఏపీ పోలీసుల దౌర్జన్యాన్ని బిహార్ పోలీసు యంత్రాంగం యావత్తూ ఒక్కటై అడ్డుకుంది. మరోవైపు ఏపీ పోలీసుల తీరుపై పట్నా కోర్టు తీవ్రంగా - మిగతా 3లో



## ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ప్రహార్

- కీలక విధానాన్ని ప్రకటించిన కేంద్రం
- బహుముఖ వ్యూహాన్ని అవలంబిస్తూ ఉగ్రవాదం పట్ల ఏమాత్రం సహనం వహించరాదన్నది ఈ విధానంలోని ప్రధాన అంశం
- “భారత్ ఉగ్రవాదాన్ని ఏ మతానికీ, జాతీయతకూ, నాగరికతకూ ముడిపెట్టదు
- ఉగ్రవాదం ప్రకటిత, అప్రకటిత లక్ష్యాలు ఏవైనా భారత్ ఎల్లవేళలా దాన్ని నిర్ద్వంద్వంగా ఖండిస్తూనే ఉంది’

2

## ‘తేజస్’ తగ్గిపోయిందా?

- జెట్లను తాత్కాలికంగా పక్కన పెట్టిన వాయుసేన?
- ప్రమాదం నేపథ్యంలో నిర్ణయం!
- సాంకేతిక సమస్యే: హెచ్ఏఎల్

2



హెరిటేజ్‌పై బొత్స వ్యాఖ్యలు

# అర్థరహితం

- వైకాపా పాలనలో జగన్ కంపెనీలకు..రూ.వెయ్యి కోట్లకు పైగా అనుచిత లబ్ధి
- ఇన్నేళ్ల తెదేపా పాలనలో హెరిటేజ్‌కు ఒక్క రూపాయీ తీసుకోలేదు : మంత్రి లోకేశ్ ధ్వజం



అమరావతి, స్వర్ణసాగరం

వైకాపా అధికారంలో ఉన్న ఐదేళ్లలో సాక్షి పత్రిక, టీవీ ఛానల్, భారతి సిమెంట్స్ సహా జగన్ కంపెనీలు ప్రభుత్వం నుంచి రూ.వెయ్యి కోట్లకు పైగా అనుచిత లబ్ధి పొందాయని విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. తెదేపా అధికారంలో ఉన్న ఇన్నేళ్లలో ప్రభుత్వం నుంచి హెరిటేజ్ ఒక్క రూపాయి కూడా లబ్ధి పొందలేదని తెలిపారు. ఏపీ సహా ఏ రాష్ట్ర ప్రభుత్వంతోనూ వ్యాపారం చేయరాదన్నది హెరిటేజ్ విధానమని స్పష్టంచేశారు. లోకేశ్ సోమవారం శాసనసభ లాబీల్లో మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. ‘ఇందాపూర్ డెయిరీ.. హెరిటేజ్‌కు కోకంపెనీ అని బొత్స సత్యనారాయణ ఆరోపించడం విడ్డూరంగా ఉంది. కోకంపెనీ అన్నదే ఉండదన్న విషయం అంత సీనియర్ నేతకు తెలియదా? ఇందాపూర్ డెయిరీ హెరిటేజ్ కంటే చాలా పెద్దది. ఆ సంస్థ ఉత్పత్తుల్లో 30% మాత్రమే రీటెయిల్‌గా విక్రయిస్తుంది. మిగతా 70% ఉత్పత్తులను - మిగతా 3లో

# బంగాల్‌లో అధికార మార్పు తీసుకురావాలి

మరికొద్ది నెలల్లో బంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. బంగాల్‌లో అధికార మార్పు తీసుకురావాలని (ప్రభుత్వాన్ని మార్చాలని) ప్రజలను కోరారు. బంగాల్‌ను 'సోనార్ బంగ్లా'గా మారుస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు బంగాల్ ప్రజలకు నరేంద్ర మోదీ సోమవారం లేఖ రాశారు. ఈ లెటర్లను బీజేపీ కార్యకర్తలు రాష్ట్ర ప్రజలకు అందించనున్నారు.



"మరికొద్ది నెలల్లో బంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఆ ఎన్నికలు రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయిస్తాయి. రానున్న తరం భవిష్యత్తు మీరు బాగా ఆలోచించి తీసుకునే నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. నేడు 'సోనార్ బంగ్లా' గురించి కలలు కనే ప్రతి యువకుడు, వృద్ధుడు, మహిళలు చాలా బాధలో ఉన్నారు. వారి బాధ నా హృదయాన్ని తాకింది. అందువల్ల నేను నా గుండె లోతుల్లో నుంచి ఒక తీర్మానం చేస్తున్నాను. బంగాల్‌ను వికసిత్ (అభివృద్ధి చెందిన), సంపన్నమైన రాష్ట్రంగా మార్చాలనేది నా సంకల్పం" అని మోదీ లేఖలో పేర్కొన్నారు.

### టీఎంసీపై విమర్శలు

గత 11 ఏళ్లుగా దేశ ప్రజల ఆశీర్వాద బలంతో తమ ప్రభుత్వం ప్రజా సంక్షేమం, సమగ్ర అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యతనిచ్చిందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. రైతుల సంక్షేమం నుంచి యువత కలలను నెరవేర్చడం వరకు, మహిళలను సాధికారపరచడం నుంచి సమాజంలోని ప్రతి వర్గాన్ని చేరుకోవడం వరకు తమ ప్రభుత్వ విధానాలు, నిరంతర ప్రయత్నాల సానుకూల ఫలితాలు నేడు స్పష్టంగా కనిపిస్తున్నాయని అన్నారు. ఈ క్రమంలో బంగాల్‌లో అధికారంలో ఉన్న టీఎంసీ సర్కార్‌పై మోదీ మండిపడ్డారు.

"బంగాల్ ప్రభుత్వం నుంచి సరైన సహకారం లేకపోయినా రాష్ట్రంలో దాదాపు 5 కోట్ల మంది ప్రజల చేత 'జన్ ధన్ యోజన' ఖాతాలు ఓపెన్ చేయించాం. 'స్వచ్ఛ భారత్ అభియాన్' కింద రాష్ట్రంలో 85 లక్షల మరుగుదొడ్లు నిర్మించాం. బంగాల్‌ను పాలిస్తున్న టీఎంసీ సర్కార్ పేదల జీవనోపాధిని లాక్కుంటోంది. మేము మాత్రం చిరు వ్యాపారులు, వ్యవస్థాపకులకు రూ.2.82 లక్షల కోట్ల విలువైన రుణాలు అందించాం. 'అటల్ పెన్షన్ యోజన' కింద 56 లక్షల మంది సీనియర్ సిటిజెన్స్‌కు ఊరట కల్పించాం. 'ఉజ్వల యోజన' ద్వారా కోటి కుటుంబాలకు ఎల్పీజీ కనెక్షన్‌లను అందించాం. తద్వారా మాతృమూర్తులు, సోదరీమణులను పొగ నుంచి విముక్తి కల్పించాం."

### అన్నదాతల ముఖాల్లో చిరునవ్వులు నింపాం!

బంగాల్ రైతులు దేశం మొత్తానికి ఆహారం సరఫరా చేస్తున్నారని, కానీ తమ కుటుంబాలను పోషించడానికి వారు కష్టపడుతున్నారని మోదీ అన్నారు. ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లో 'కిసాన్ సమ్మాన్ నిధి' ద్వారా 52 లక్షల మంది రైతులకు ప్రత్యక్ష ఆర్థిక సహాయం చేస్తున్నామని అన్నారు. తద్వారా అన్నదాతల ముఖాల్లో చిరునవ్వులు నింపడం అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. "బంగాల్ దేశ ఆర్థిక వ్యవస్థ దిశను నిర్ణయించేది. పారిశ్రామిక అభివృద్ధిలో అగ్రగామిగా ఉండేది. కానీ నేడు ఈ అద్భుతమైన రాష్ట్రం దీనావస్థను చూసి నా మనసు బాధపడుతోంది. 6 దశాబ్దాల బుజ్జగింపు రాజకీయాల కారణంగా బంగాల్‌కు జరిగిన కోలుకోలేని నష్టాన్ని మాటల్లో వ్యక్తపరచలేం. ఓ వైపు యువత ఉపాధి లేకపోవడం వల్ల ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లాల్సి వస్తుంది. మరోవైపు రాష్ట్రంలోని మహిళలు తమకు భద్రత లేదని భావిస్తున్నారు. స్వామి వివేకానంద, రిషి అరబిందో కలలు కన్న బంగాల్ నేడు ఓటు బ్యాంకు రాజకీయాలు, హింస, అరాచకత్వంతో నిండిపోయింది" అని మోదీ పేర్కొన్నారు.

అక్రమ చొరబాట్లు, మహిళలపై హింసతో బంగాల్ మునిగిపోయిందని మోదీ ఆరోపించారు. దేశంలోని అనేక రాష్ట్రాల్లో నేడు జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయని, పేదల ముఖాల్లో చిరునవ్వులు వికసించాయని అన్నారు. బంగాల్‌లో కూడా ఈ అభివృద్ధి, పురోగతిని తాను తీసుకొస్తానని తెలిపారు. భరతమాత ముద్దుబిడ్డలు కలలు గన్న బంగాల్‌ను పునర్నిర్మిద్దామని పిలుపునిచ్చారు. 2026 నాటికి రాష్ట్రాన్ని వికసిత్ బంగాల్‌గా మారుస్తామని ప్రమాణం చేద్దామని అన్నారు.

"మీకు సేవ చేసే అవకాశం నాకు లభిస్తే ప్రతి క్షణాన్ని మీ ముఖంలో చిరునవ్వు తీసుకురావడానికి ప్రయత్నిస్తాను. అవినీతి నుంచి ప్రజలను విముక్తి చేస్తాను. మహిళల భద్రత కోసం పాటుపడతాను. మన పిల్లలు (బంగాల్ యువత) ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదు. మత హింసకు గురైన మన శరణార్థ సోదర సోదరీమణులు సీఏఏ ద్వారా పౌరసత్వం పొందుతారు" అని మోదీ స్పష్టం చేశారు.

# దేశంలో తొలి 'కౌంటర్ టెర్రరిజం పాలసీ'
# 'ప్రహార్'తో ఇక ఉగ్రవాదులకు చుక్కలే!

ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపేందుకు కేంద్ర హోం శాఖ సిద్ధమైంది. 'ప్రహార్' పేరుతో దేశంలో తొలి ఉగ్రవాద నిరోధక విధానాన్ని (కౌంటర్ టెర్రరిజం పాలసీ) తీసుకొచ్చింది. ఉగ్రవాద సవాళ్లను ఎదుర్కొనే రీతిలో ఈ పాలసీని రూపొందించారు. సీమాంతర ఉగ్రవాదం, సైబర్ దాడులు, డ్రోన్ల దుర్వినియోగం, సాంకేతిక సవాళ్లను ఎదుర్కొనేందుకు ఈ పాలసీని తీసుకొచ్చారు. ఈ మేరకు కేంద్ర హోంశాఖ సోమవారం తన వెబ్‌సైట్‌లో ప్రహార్ డాక్యుమెంట్‌ను అప్లోడ్ చేసింది.




"సీమాంతర ఉగ్రవాదంతో పాటు నేరస్థులైన హ్యాకర్లు, ఇతర దేశాలు సైబర్ దాడుల ద్వారా భారత్‌ను టార్గెట్ చేస్తున్నాయి. భారతదేశం నీరు, భూమి, గాలి ద్వారా ఉగ్రవాద ముప్పులను ఎదుర్కొంటోంది. విద్యుత్, రైల్వేలు, విమానయానం, ఓడరేవులు, రక్షణ, అంతరిక్షం, అణుశక్తితో సహా దేశ ఆర్థిక వ్యవస్థలోని కీలకమైన రంగాలను విదేశీ శక్తులు, ముష్కరుల నుంచి రక్షించే సామర్థ్యాలను అభివృద్ధి చేశాం." అని హోం శాఖ 'ప్రహార్' డాక్యుమెంట్‌లో పేర్కొంది.

### హోంశాఖ డాక్యుమెంట్‌లో కీలక విషయాలు

"ఉగ్రవాదాన్ని ఓ మతానికి, ప్రాంతానికి, నాగరికతకు భారత్ ఆపాదించబోదు. భారతదేశం అన్ని రకాల ఉగ్రవాదాన్ని ఖండిస్తుంది. నిరంతరం ఉగ్రవాద బాధితులకు అండగా నిలుస్తుంది. ప్రపంచంలో హింసకు ఎటువంటి చోటు లేదని నమ్ముతుంది. ఈ క్రమంలో జీరో టాలరెన్స్ విధానాన్ని అనుసరిస్తుంది. సరిహద్దు అవతల నుంచి చేసే స్పాన్సర్డ్ టెర్రరిజం భారత్‌పై చాలా కాలంగా ప్రభావం చూపుతోంది. జిహాదీ టెర్రర్ గ్రూపులు, వారికి సంబంధించిన సంస్థలు దేశంలో దాడులకు ప్రణాళికలు వేసి అమలు చేస్తూనే ఉన్నాయి." అని హోం శాఖ డాక్యుమెంట్‌లో వెల్లడించింది.

### 'విదేశాల నుంచి ముష్కరులు కుట్రలు'

ఆల్ఖైదా, ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ ఇరాక్ అండ్ సిరియా (ఐఎస్ఐఎస్) వంటి టెర్రర్ గ్రూప్స్ గురించి కూడా ఈ పాలసీలో కేంద్ర హోం శాఖ ప్రస్తావించింది. ఈ టెర్రర్ గ్రూపులు స్లీపర్ సెల్స్ ద్వారా భారత్‌లో హింసను ప్రేరేపించడానికి ప్రయత్నించాయని పేర్కొంది. విదేశాల నుంచి పనిచేస్తున్న ముష్కరులు దేశంలో ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడానికి కుట్రలు పన్నారని స్పష్టం చేసింది. పంజాబ్, జమ్ముకశ్మీర్ లాంటి రాష్ట్రాల్లో ఉగ్ర సంస్థలు డ్రోన్లు వాడి తమ నెట్‌వర్క్‌ను పెంచే ప్రయత్నం చేస్తున్నాయని వెల్లడించింది.

"డిజిటల్ టెక్నాలజీని టెర్రరిస్టులు వాడుతున్నారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు, ఇన్‌స్టంట్ మెసేజింగ్ అప్లికేషన్‌లు, ఎన్‌క్రిప్షన్ టూల్స్, డార్క్ వెబ్, క్రిప్టో వాలెట్‌లను ఉగ్రవాద ప్రచారం, నిధులు, కార్యాచరణ మార్గదర్శకత్వం కోసం ఉపయోగిస్తున్నారు. ముష్కరులు వాడే జదీ=చీజుణ (కెమికల్, బయోలాజికల్, రేడియోలాజికల్, న్యూక్లియర్, ఎక్స్‌ప్లోజివ్, డిజిటల్) వంటి వాటిని యాక్సెస్ చేయడం ఉగ్రవాద నిరోధక (కౌంటర్ టెర్రరిజం) ఏజెన్సీలకు ఒక సవాల్‌గా మిగిలిపోయింది. దేశం గాలి, భూమి, నీటి ద్వారా ప్రమాదాలను ఎదుర్కొంటోంది. "అని హోం శాఖ 'ప్రహార్' డాక్యుమెంట్‌లో పొందుపర్చింది.

ఉగ్రవాదాన్ని ఎదుర్కొనే విధానంలో భాగంగా కేంద్ర హోంశాఖ ఓ రోడ్‌మ్యాప్‌ను సైతం రూపొందించింది. నేరస్థులపై కేసులను బలంగా నమోదు చేసేందుకు ఎఫ్ఐఆర్ నమోదు నుంచి దర్యాప్తు జరిగే వరకు ప్రతి దశలోనూ లీగల్ నిపుణుల సలహా తీసుకోవాలని పేర్కొంది. దేశ యువతను ఉగ్ర గ్రూపులు రిక్రూట్ చేసుకుంటున్నాయని, అలాంటి వ్యక్తులపై న్యాయపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని వెల్లడించింది. తీవ్ర హింసకు పాల్పడినా, యువతను ప్రలోభ పెట్టినా ఆ తర్వాత జరిగే పరిణామాల గురించి ఎన్జీఓలు, మతపరమైన నాయకులకు వివరించనున్నట్లు తెలిపింది. భద్రతా సమస్యలను ఓ సహకార పద్ధతిలో, సాంకేతికంగా, కమ్యూనిటీ స్థాయిలో పరిష్కరించే రీతిలో సూచనలు చేస్తూ ప్రహార్ డాక్యుమెంట్‌ను తీసుకొచ్చారు.

### ప్రహార్ లక్ష్యాలు ఏంటంటే?

దేశ పౌరులను రక్షించడానికి ఉగ్రవాద దాడులను నివారించడం

కేంద్ర, రాష్ట్ర సంస్థల మధ్య సమన్వయాన్ని తేవడం

చట్టపరమైన విధానాలను పాటిస్తూ మానవ హక్కులను కాపాడడం

ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే పరిస్థితులను అరికట్టడం (తగ్గించడం)

అంతర్జాతీయంగా ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికి ప్రపంచ భాగస్వాములతో కలిసి పనిచేయడం

# లంచం, అవినీతే సీఎం అసలైన స్నేహితులు'- స్టాలిన్‌పై విజయ్ ఫైర్

తమిళనాడు రాజకీయాల్లో ఎన్నికల వేడి పెరుగుతున్న వేళ, నటుడిగా స్టార్‌డమ్ సాధించి రాజకీయాల్లోకి అడుగుపెట్టిన విజయ్ అధికార పార్టీ డీఎంకేను ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్?పై తీవ్ర ఆరోపణలు గుప్పిస్తూ, ఆయన అసలైన స్నేహితులు లంచం, అవినీతి, స్వార్థ రాజకీయాలేనని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా మోసం చేస్తున్నారని మండిపడ్డారు. వెల్లూరులో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడిన విజయ్, ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి ప్రచారం పూర్తిగా నాటకమని అన్నారు. "రాష్ట్రాన్ని సూపర్‌స్టార్ స్టేట్ చేశామని చెబుతున్నారు. కానీ ప్రజల జీవన స్థాయిలో మార్పు ఎక్కడుంది?" అంటూ ప్రశ్నించారు. తమిళనాడు గతంలో నిజమైన అభివృద్ధిని చూసిందంటే అది కామరాజ్, అన్నాదురై, ఎంజీఆర్ వంటి మహానేతల కాలంలోనేనని గుర్తుచేశారు.

### చరిత్రాత్మక ఎన్నికలుగా నిలుస్తాయంటూ!

ఆ రోజుల్లో ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగేదని, ఇప్పుడు మాత్రం ప్రచారం, రాజకీయ లాభాలే ముఖ్యమైపోయాయని విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వాన్ని ఉల్టా మోడల్ గవర్నమెంట్, స్టాండ్‌అప్ కామెడీ ప్రభుత్వం అంటూ ఎద్దేవా చేశారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలు సాధారణ ఎన్నికలు కావని, చరిత్రాత్మక ఎన్నికలుగా నిలుస్తాయని విజయ్ పేర్కొన్నారు. "ఈసారి అందరూ కలిసి నన్నే లక్ష్యంగా చేసుకున్నారు. అయినా ప్రజలే నా బలం" అన్నారు. అసలు పోరు తన పార్టీ తమిళగ వెట్రి కళగం (టీవీకే) డీఎంకే మధ్యేనని స్పష్టం చేశారు. "తమిళనాడు అంటే విజయ్– విజయ్ అంటే తమిళనాడు" అంటూ భావోద్వేగ



వ్యాఖ్యలు చేసిన ఆయన, ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వాన్ని తీసుకురావడమే తన లక్ష్యమని చెప్పారు. స్టాలిన్ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ కాగితాలకే పరిమితమ య్యా యని, పేదల సమస్యలు అలాగే ఉన్నాయని ఆరోపించారు. టీవీకే అధికారంలోకి వస్తే రాష్ట్రంలోని ప్రతి జిల్లాకు వెళ్లి ప్రజలను స్వయంగా కలుస్తానని హామీ ఇచ్చారు. ప్రతి పౌరుడి సమస్యను వినిపించి పరిష్కారం చూపుతానన్నారు. ప్రజల ఓటు హక్కు పవిత్రమని, ఎవరూ దాన్ని లాక్కోలేరని స్పష్టం చేశారు. తమ పార్టీ ఎన్నికల గుర్తు విజల్?కు ఓటు వేయాలని కార్యకర్తలు, అభిమానులను కోరారు. "మా ఓటు, మా హక్కు" అంటూ నినాదాలు చేశారు.

### రాజకీయాల్లో ఆసక్తి

ఇదిలా ఉండగా, రాష్ట్ర రాజకీయాల్లో ప్రధానంగా అధికార డీఎంకే కూటమి, ప్రతిపక్ష అఖిల భారత అన్నా ద్రవిడ మున్నేట్ర కళగం (ఏఐఏడీఎంకే) ఆధ్వర్యంలోని ఎన్డీఏ కూటమి మధ్య పోటీ నెలకొంది. ఎన్డీఏలో భారతీయ జనతా పార్టీ కీలక పాత్ర పోషిస్తోంది. ఇక డీఎంకే కూటమిలో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ సహా పలు పార్టీలు భాగస్వాములుగా ఉన్నాయి. ఈ రాజకీయ సమీకరణాల మధ్య విజయ్ పార్టీ టీవీకే కొత్త శక్తిగా రంగప్రవేశం చేయడం రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. సినీ కెరీర్‌కు గుడ్‌బై చెప్పి పూర్తిస్థాయిలో రాజకీయాలపై దృష్టి పెట్టిన విజయ్, యువత మరియు అభిమానుల మద్దతుతో ముందుకు సాగుతున్నారు. ఆయన సభలకు భారీగా జనసందోహం తరలివస్తుండటం రాజకీయ వర్గాల్లో ఇపప్పు చర్చనీయాంశమవుతోంది. అధికార పార్టీపై నేరుగా దాడి చేస్తూ, ప్రజలతో భావోద్వేగ అనుబంధం పెంచుకునే ప్రయత్నం చేస్తున్నారు. మొత్తానికి, విజయ్ వ్యాఖ్యలతో తమిళనాడు రాజకీయాల్లో వేడి మరింత పెరిగింది. డీఎంకే ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు చేస్తూ, ప్రత్యామ్నాయ నాయకత్వంగా తనను ప్రజలకు పరిచయం చేసుకుంటున్నారు. రాబోయే ఎన్నికల్లో ఈ వ్యాఖ్యలు ఎంత మేర ప్రభావం చూపుతాయో, టీవీకే ఎంత వరకు ప్రభావం చూపగలదో ఎన్నికల ఫలితాలే తేల్చనున్నాయి.

## 'తేజస్' తగ్గిపోయిందా!

స్వర్ణసాగరం న్యూఢిల్లీ

దేశీయంగా అభివృద్ధి చేసిన తేలికరకం తేజస్ యుద్ధ విమానాల వినియోగాన్ని వాయుసేన తాత్కాలికంగా పక్కన పెట్టిందంటూ వార్తలు వస్తున్నాయి! ప్రభుత్వ రంగ హిందూస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్) ప్రతిష్టాత్మకంగా రూపొందించిన ఆ యుద్ధ విమానాలు తరచూ ప్రమాదాల బారిన పడుతుండటంతో ముందుజాగ్రత్తగా ఈ నిర్ణయానికి వచ్చినట్టు చెబుతున్నారు. ఫిబ్రవరి 7వ తేదీన తేజస్ విమానం ల్యాండవుతుండగా ప్రమాదానికి గురైనట్టు సోమవారం వార్తలొచ్చాయి. పైలట్ సురక్షితంగా బయటపడ్డా, ఆ ప్రమాదంలో విమానం బాగా దెబ్బతిన్నట్టు అవి పేర్కొన్నాయి. కానీ దీన్ని హెచ్ఏఎల్ మంగళవారం ఖండించింది. జరిగింది ప్రమాదం కాదని, 'చిన్న ఘటన'మాత్రమేనని చెప్పుకొచ్చింది. ఈ మేరకు సంస్థ అధికార ప్రతినిధి ఒక ప్రకటన జారీ చేశారు. "తేజస్ నేలకూలిందన్న వార్తలు నిజం కాదు. విమానం నేలపై ఉండగా చిన్న సాంకేతిక సమస్య తలెత్తిందంతే"అని పేర్కొన్నారు. "తేజస్ విషయంలో ప్రపంచంలోని అత్యుత్తమ భద్రతా ప్రమాణాలను పాటిస్తున్నాం. తాజా ఉదంతాన్ని లోతుగా పరిశీలిస్తున్నాం. ఈ విషయంలో వాయుసేనతో కలిసి పని చేస్తున్నాం. సమస్య త్వరలో పరిష్కారం అవుతుంది"అని వివరించారు. అయితే తేజస్‌లో తాజాగా తలెత్తిన సాంకేతిక సమస్యకు సంబంధించి వివరాలేమీ వెల్లడించలేదు. ఫిబ్రవరి 7న ఒక వైమానిక స్థావరంలో ల్యాండయ్యే క్రమంలో తేజస్ విమానం రన్‌వేను దాటి ముందుకు వెళ్లిపోవడంతో బాగా దెబ్బ తిన్నట్టు చెబుతున్నారు. దాంతో అదిక వినియోగానికి ఏమాత్రమూ పనికిరాదని వాయుసేన నిర్ధారించినట్టు వార్తలొచ్చాయి. దీనిపై కూడా హెచ్ఏఎల్ తన ప్రకటనలో స్పందించలేదు. ప్రస్తుతానికి తేజస్ రకం విమానాలన్నింట్లో వాయుసేన పూర్తిస్థాయిలో తనిఖీలు నిర్వహిస్తున్నట్టు చెబుతున్నారు. భద్రత తదితర ప్రమాణాలను పూర్తిగా నిర్ధారించుకున్నాకే తిరిగి వాటి వాడకంపై నిర్ణయం తీసుకుంటుందని తెలుస్తోంది. షెడ్యూల్ మేరకు తేజస్ శ్రేణిలో రెండో తరం ఎంకే1ఏ యుద్ధవిమానాల భద్రతా ప్రమాణాలను వచ్చే ఏప్రిల్లో వాయుసేన పూర్తిస్థాయిలో తనిఖీ చేయాల్సి ఉంది. వాటిని వాయుసేన అమ్ములపొదిలోకి చేర్చుకోవడంపై ఆ తర్వాతే రక్షణ శాఖ తుది నిర్ణయానికి రానుంది. వాయుసేనలో ప్రస్తుతం 30 తేజస్ ఎంకే1 శ్రేణి యుద్ధ విమానాలు సేవలందిస్తున్నాయి. తేజస్ తాజా ప్రమాదానికి సాంకేతిక సమస్యలే కారణమని ప్రాథమికంగా తేలినట్టు చెబుతున్నారు. ముఖ్యంగా విమానంలోని పలు ఆన్‌బోర్డ్ వ్యవస్థల్లో కీలక వైఫల్యాలను గుర్తించారని అంటున్నారు.

## ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ప్రహార్



దిల్లీ

కేంద్ర ప్రభుత్వం సోమవారం "ప్రహార్" పేరుతో దేశంలో తొలి ఉగ్రవాద నిర్మూలన విధానానికి తెరతీసింది. బహుముఖ వ్యూహాన్ని అవలంబిస్తూ ఉగ్రవాదం పట్ల ఏమాత్రం సహనం వహించరాదన్నది ఈ విధానంలోని ప్రధాన అంశం. నిఘా ఆధారంగా ఉగ్రవాద హింసను నిరోధించడం, ఉగ్రవాదులకు, వారికి ఆర్థిక సాయం చేసేవారికి, మద్దతు దారులకు నిధులు, ఆయుధాలు, ఆశ్రయం అందకుండా చేయడం ఈ పథకం ఉద్దేశమని హోంశాఖ పేర్కొంది. దేశ విదేశాల నుంచి ఎదురవుతున్న ఉగ్రవాద ముప్పును నిర్మూలించేందుకు ఈ విధానానికి ఏడు స్తంభాల్లాంటి అంశాలను నిర్దేశించారు. ఉగ్రవాద నిరోధం, సత్వర స్పందన, అంతర్గత సామర్థ్యాల వినియోగం, మానవహక్కులు, చట్టపాలన ఆధారిత పద్ధతుల అనుసరణ, ఉగ్రవాదానికి దారితీస్తున్న మత ఛాందస భావనల కట్టడి, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా అంతర్జాతీయ స్థాయిలో జరుగుతున్న ప్రయత్నాలతో జతకలవడం అనే ఈ అంశాలు ప్రహార్‌కు పునాది వంటివని స్పష్టం చేసింది. భారత్ పొరుగున తరచూ అస్థిర పరిస్థితులు నెలకొంటున్న కారణంగా ఆయా ప్రాంతాల్లో అరాచక పరిస్థితులు తలెత్తుతున్నాయి. మన ప్రాంతంలోని కొన్ని దేశాలు ఉగ్రవాదాన్ని తమ ప్రభుత్వ విధానంగా ఎంచుకున్నాయని హోంశాఖ తన విధాన పత్రంలో పాకిస్థాన్‌ను పరోక్షంగా ప్రస్తావించింది.

"భారత్ ఉగ్రవాదాన్ని ఏ మతానికీ, జాతీయతకూ, నాగరికతకూ ముడిపెట్టదు. ఉగ్రవాదం ప్రకటిత, అప్రకటిత లక్ష్యాలు ఏవైనా భారత్ ఎల్లవేళలా దాన్ని నిర్ద్వంద్వంగా ఖండిస్తూనే ఉంది" అని హోంశాఖ విధాన పత్రం పేర్కొంది. కొన్ని వర్గాల్లో నెలకొన్న దారిద్ర్యం, నిరుద్యోగం వంటి సమస్యల్ని ప్రతికూల శక్తులు తమకు అనుకూలంగా ఉపయోగించుకోకుండా నిరోధించేందుకు భారత ప్రభుత్వం ఆయా సమస్యల పరిష్కారానికి అనేక పథకాలు ప్రవేశపెట్టిందని పేర్కొంది. ఉగ్రవాద కార్యకలాపాల కోసం సమాచార, కమ్యూనికేషన్ల సాంకేతిక పరిజ్ఞానాన్ని దురుపయోగ పరిచే తత్వాన్ని నిర్మూలించేందుకు తాము కంకణబద్ధులమై ఉన్నామని విధానపత్రం తెలిపింది. ఇందుకోసం సాంకేతిక పరిజ్ఞాన రంగంలో పెట్టుబడులు పెంచడంతోపాటు, ప్రైవేటు భాగస్వామ్యానికి వీలు కల్పిస్తున్నట్టు వెల్లడించింది.

## తమిళనాడులో 74 లక్షల ఓట్లు తొలగింపు

తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికల నగారా మోగనున్న తరుణంలో ఓటర్ల జాబితా ప్రక్షాళన ప్రక్రియ ఒక కొలిక్కి వచ్చింది. ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ అనంతరం ఈరోజు తుది జాబితాను రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి అర్చనా పట్నాయక్ విడుదల చేశారు. తాజా జాబితా ప్రకారం రాష్ట్రంలో మొత్తం ఓటర్ల సంఖ్య 5.67 కోట్లుగా నమోదైంది. గతంలో ఉన్న 6.41 కోట్ల ఓటర్లతో పోలిస్తే, ఈ ప్రక్షాళనలో ఏకంగా 74 లక్షల మంది ఓటర్లను జాబితా నుంచి తొలగించడం గమనార్హం. డూప్లికేట్ ఓట్లు, మరణించిన వారి పేర్లు, నివాసం మారుతున్న వారి వివరాలను క్షుణ్ణంగా వెరిఫై చేసిన తర్వాతే ఈ భారీ తొలగింపులు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. లింగ నిష్పత్తి పరంగా చూస్తే ఈసారి కూడా తమిళనాడులో మహిళా ఓటర్లే ఆధిపత్యం ప్రదర్శిస్తున్నారు. మొత్తం 5,67,07,380 మంది ఓటర్లలో 2.89 కోట్ల మంది మహిళలు ఉండగా, 2.77 కోట్ల మంది పురుషులు, 7,617 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. డిసెంబర్ 19 నుంచి జనవరి 30 వరకు వచ్చిన లక్షలాది అప్లికేషన్లను పరిశీలించి, అర్హులైన కొత్త ఓటర్లను కూడా జాబితాలో చేర్చారు. ఈ వేసవిలో జరగబోయే ఎన్నికల కోసం ఈ జాబితానే కీలకం కానుంది.



# స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే బీసీ రిజర్వేషన్ల పెంపు

స్వర్ణసాగరం అమరావతి

స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే బీసీ రిజర్వేషన్లు పెంచుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చారు. "ఎన్డీయేపై ఎంతో నమ్మకంతో ఓట్లేసి గెలిపించారు. ఆ నమ్మకాన్ని కాపాడుకోవాలి. వైకాపా హయాంలో బీసీ రిజర్వేషన్లు 33% నుంచి తగ్గించారు. మళ్లీ వాటిని పెంచడానికి ఏకసభ్య కమిషన్ వేశాం. నివేదిక రాగానే చట్టం చేసి అమలుచేస్తాం. బీసీల రక్షణకు మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటుచేశాం. వారిచ్చే నివేదికను అమలుచేస్తాం. బీసీ వర్గాల్లోని కొందరు తమను ఎస్సీ, ఎస్టీల్లో చేర్చాలని కోరారు. వాటిని కేంద్రానికి పంపాం" అని తెలిపారు. "బలహీనవర్గాల సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తాం. ప్రజాప్రతినిధులు ఏ పనిచేసినా.. దాని ద్వారా బలహీనవర్గాల్ని ఎంతవరకు ఆదుకుంటున్నామన్న సంగతిని దృష్టిలో ఉంచుకోవాలి. ఇది బలహీనవర్గాల ప్రభుత్వం.. వారికి అన్నివిధాలా అండగా ఉంటాం" అని వెల్లడించారు. శాసనసభలో సోమవారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖలతోపాటు ఆహార పౌరసరఫరాలశాఖకు 2026–27 ఆర్థిక సంవత్సరానికి గ్రాంట్ల కోసం అభ్యర్థనపై చర్చ తర్వాత చంద్రబాబు మాట్లాడారు. "ఎస్సీ వర్గీకరణ 1996–97లో తొలిసారిగా తెదేపా ప్రభుత్వమే తెచ్చింది. తర్వాత వచ్చిన ప్రభుత్వాలు దాన్ని కాపాడలేకపోయాయి. సుప్రీంకోర్టు అనుమతివ్వడంతో.. మళ్లీ ఎస్సీ వర్గీకరణ అమలు చేసి.. దామాషా ప్రకారం సామాజిక న్యాయం చేశాం" అని వివరించారు.

**గిరిజనుల సమస్యకు ఆమోదయోగ్య విధానంలో పరిష్కారం**

గిరిజనుల అభ్యున్నతికి జీవో 3 (గిరిజన ప్రాంతాల్లో 100% ఉద్యోగాలు స్థానిక గిరిజనులకే కల్పించేలా) తెచ్చినట్లు చంద్రబాబు తెలిపారు. దానిని వైకాపా వాళ్లు కాపాడలేకపోయారని, సుప్రీంకోర్టులో దీన్ని కొట్టేశారని చెప్పారు. ఆచరణ, ఆమోదయోగ్యమైన విధానంలో ఈ సమస్యకు పరిష్కారం చూపడానికి సిద్ధంగా ఉన్నట్లు స్పష్టంచేశారు. ఈ అంశంపై సమావేశాలు పెట్టాలని అధికారులను ఆదేశించామని, అందులో వచ్చే సూచనల ఆధారంగా నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. చంద్రబాబు ప్రసంగంలోని ముఖ్యాంశాలు..

**సంక్షేమానికి బడ్జెట్ పెంచాం**

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు వీలైనంత వరకు బడ్జెట్ పెంచాం. చిత్తశుద్ధితో అమలుచేస్తాం.
బలహీనవర్గాల్లోని అంగన్‌వాడీ, ప్రాథమిక పాఠశాలలు, రెసిడెన్షియల్ విద్యపై ప్రత్యేకదృష్టి పెట్టాం.
పథకం ఏదైనా మహిళలకే ప్రాధాన్యం
కార్యక్రమమైనా, పథకమైనా మహిళలకే ప్రాధాన్యమిస్తున్నాం.
అగ్రవర్ణాల్లో ఆర్థికంగా వెనకబడినవారిని ఆదుకుంటాం. పేదలందరికీ అండగా ఉంటాం.
ప్రతి కుటుంబానికీ ఆర్థికభద్రత కల్పిస్తాం. త్వరలో ఫ్యామిలీ కార్డు ఇస్తాం.
కుటుంబం యూనిట్‌గా సాధికారత కల్పిస్తాం.
సంజీవని ద్వారా ఆర్థిక వెసులుబాటు లభించే ప్రణాళికలు అమలుచేస్తున్నాం.
ఆర్థిక అసమానతల తగ్గింపే కూటమి ప్రభుత్వ లక్ష్యం.
సూపర్ సిక్స్ సూపర్‌హిట్ చేశాం
ఎన్ని ఇబ్బందులున్నా సూపర్ 6 సూపర్‌హిట్ చేశాం. ఇది మొదటి చర్య మాత్రమే.
రాష్ట్రంలోని అన్నివర్గాలకూ సంక్షేమ కార్యక్రమాలు అందిస్తున్నాం.
ఆటోడ్రైవర్లు, మత్స్యకారులు, చేనేత కార్మికులు సహా అందరినీ ఆదుకుంటున్నాం.
ప్రజాపంపిణీ వ్యవస్థకు సాంకేతికత వినియోగిస్తున్నాం.
స్వర్ణాంధ్ర 2047 అమల్లో భాగంగా 2047 నాటికి రాష్ట్రంలో తలసరి ఆదాయాన్ని రూ.3 లక్షల నుంచి రూ.54 లక్షలకు పెంచాలి.
పీ4 కార్యక్రమం కింద 10 లక్షల బంగారు కుటుంబాల్ని లక్షలమంది మార్గదర్శులు దత్తత తీసుకున్నారు.
ఏ కార్యక్రమమైనా ఫలితాలు వెంటనే రావు. నిరంతరం పర్యవేక్షిస్తే ఆర్థిక అసమానతల తగ్గింపునకు ఇంతకు మించిన కార్యక్రమం లేదు.

# రెడ్‌బుక్ రివర్స్.. బిహార్‌లో బేజార్!

-మొదటిపేజీ తరువాయి

మండిపడింది. ఎస్పీ దామోదర్ దర్యాప్తు అధికారులు పాటించాల్సిన కనీస నిబంధనలను కూడా అనుసరించకుండా ఓ ఐపీఎస్ అధికారి నివాసంలో చొరబడటంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. "ఎఫ్ఐఆర్‌లో పేరు లేదు.. కేసు డైరీ లేదు.. స్థానిక కోర్టు నుంచి వారెంట్ లేదు.. ఇవేవీ లేకుండా ఒక సామాన్యుడిని కూడా అరెస్టు చేయడానికి వీల్లేదు.. అటువంటిది ఒక ఐపీఎస్ అధికారిని అరెస్టు చేయడానికి ఏపీ నుంచి పోలీసులు బిహార్ రావడం ఏమిటి..? సునీల్ నాయక్ అరెస్టును అనుమతించేది లేదు.. ట్రాన్సిట్ వారెంట్ జారీ చేసే ప్రసక్తే లేదు.." అని పట్నా సివిల్ కోర్టు మండిపడింది. సునీల్ నాయక్‌ను అరెస్టు చేసేందుకు అనుమతించేది లేదని తేల్చి చెప్పింది. ఒక దశలో ఏపీ పోలీసులను అరెస్టు చేస్తామని కూడా వ్యాఖ్యానించింది. దాంతో బిహార్‌లో తీవ్ర అవమానానికి గురైన ఏపీ పోలీసులు బిక్క మొహంతో తిరుగుముఖం పట్టారు. ఆంధ్రప్రదేశ్ పరువు ప్రతిష్టలను బజారుకీడ్చి తీవ్ర అవమానభారంతో వెనుదిరిగారు. యావత్ దేశంలో సంచలనంగా మారిన ఏపీ పోలీసుల రెడ్‌బుక్ అరాచకం ఇలా ఉంది..!!

**కిడ్నాపర్ల మాదిరిగా ఏపీ పోలీసులు..**

డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు ఇచ్చిన ఫిర్యాదుపై అక్రమ కేసు నమోదు చేసిన ఏపీ పోలీసులు బరితెగించి వేధింపులకు పాల్పడుతున్న విషయం తెలిసిందే. ఆయన అహాన్ని సంతృప్తి పరచడం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు యావత్ పోలీసు శాఖకు రెడ్‌బుక్ టాస్క్ ను అప్పగించారు. దాంతో గుంటూరులోని నగరపాలెం పోలీసు స్టేషన్‌లో అక్రమ కేసు నమోదు చేయించి దర్యాప్తు పేరిట దళిత, గిరిజన ఐపీఎస్ అధికారులను వేధిస్తున్నారు. అందుకోసం అప్పటి ప్రకాశం జిల్లా ఎస్పీ దామోదర్‌ను ప్రత్యేక అధికారిగా నియమించారు. ఆయన విజయనగరం జిల్లా ఎస్పీగా బదిలీ అయినా సరే ఈ కేసు దర్యాప్తు అధికారిగా కొనసాగుతున్నారు. ఈ క్రమంలో గతంలో డిప్యుటేషన్‌పై రాష్ట్రంలో సీఐడీ డీఐజీగా పని చేసిన గిరిజన ఐపీఎస్ అధికారి సునీల్ నాయక్‌ను లక్ష్యంగా చేసుకున్నారు.
ప్రస్తుతం బిహార్‌లో అగ్నిమాపక శాఖ, హోంగార్డ్స్ విభాగం ఐజీగా ఉన్న ఆయన్ను అక్రమంగా అరెస్టు చేసేందుకు ఏపీ పోలీసుల బృందం తాజాగా పట్నా వెళ్లింది. అందుకోసం ఏపీ పోలీసులు కిడ్నాపర్ల మాదిరిగా వ్యవహరించారు. ఎస్పీ దామోదర్ తన బృందంతో కలసి సోమవారం తెల్లవారుజామున సునీల్ నాయక్ అధికారిక నివాసం గోడ దూకి లోపలికి ప్రవేశించారు. ఆయన్ను చుట్టిముట్టి బలవంతంగా తమతో లాక్కెళ్లేందుకు యత్నించారు. అప్రమత్తమైన సునీల్ నాయక్ ప్రతిఘటించి కేకలు వేయడంతో పక్కన పోలీస్ క్వార్టర్స్‌లో ఉన్న అధికారులు అక్కడకు చేరుకున్నారు. కిడ్నాపర్లు వచ్చారని భావించి దాదాపు వందమంది పోలీసులు, హోంగార్డులు ఆ నివాసాన్ని చుట్టుముట్టారు.

**ఎఫ్ఐఆర్‌లో పేరు లేదు... కేసు డైరీ, వారెంటూ లేదు..**

బిహార్ అగ్ని మాపక శాఖ డీజీతోపాటు పలువురు అధికారులు, ప్రభుత్వ న్యాయవాదులు అక్కడకు చేరుకుని గట్టిగా నిలదీయడంతో ఏపీ పోలీసుల బండారం బయటపడింది. తాను ఎస్పీనని.. సునీల్ నాయక్‌ను అరెస్టు చేసేందుకు వచ్చామని దామోదర్ చెప్పడంతో బిహార్ పోలీసు అధికారి, న్యాయవాదులు తీవ్రంగా స్పందించారు. అరెస్టు వారెంటు ఉందా? అని ప్రశ్నించగా ఏపీ పోలీసులు తెల్లమొహం వేశారు. పోనీ ఏ కేసులో అరెస్టు చేస్తున్నారు..? కేసు డైరీ ఉందా..? ఎఫ్ఐఆర్ కాపీ ఉందా..? స్థానిక కోర్టు ఇచ్చిన ట్రాన్సిట్ వారెంట్ ఉందా..? అని నిలదీయడంతో అవేవీ తమ వద్ద లేవని బదులిచ్చారు. అసలు సునీల్‌నాయక్‌కు వ్యతిరేకంగా ఎటువంటి ఆధారాలు లేవని గతంలో సుప్రీంకోర్టు చెప్పింది కదా..! అని న్యాయవాదులు గుర్తు చేయడంతో ఏపీ పోలీసులు మౌనం దాల్చారు. అయినా సరే.. 35 బీఎన్ఎస్ఎస్ కింద సునీల్‌నాయక్‌ను తాము అరెస్టు చేస్తున్నట్లు ఏకపక్షంగా ప్రకటించారు.
అయితే ఆ నిబంధన కింద అరెస్టు చేసేందుకు వారికి అధికారం లేదని న్యాయవాదులు అభ్యంతరం తెలిపినా ఆలకించలేదు. ఆయన్ను అరెస్టు చేశామని, తమతో తీసుకువెళ్తామని మొండిగా వాదించారు. సునీల్‌నాయక్‌ను బలవంతంగా తీసుకువెళ్లేందుకు యత్నించారు. దాంతో బిహార్ పోలీసులు తీవ్రంగా స్పందించారు. వంద మందికిపైగా పోలీసులు, హోంగార్డులు ఏపీ పోలీసు బృందాన్ని చుట్టుముట్టడంతో తీవ్ర గందరగోళం నెలకొంది. అక్కడకు చేరుకున్న పట్నా ఎస్పీ (ఈస్ట్) భానుప్రతాప్‌సింగ్ ఏపీ పోలీసుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సునీల్ నాయక్‌ను మీరు అరెస్టు చేశామనుకుంటే అనుకోండి..! కానీ ఆయన్ను మా అనుమతి లేకుండా... న్యాయస్థానం ట్రాన్సిట్ వారెంట్ లేకుండా తీసుకెళ్లేందుకు అనుమతించబోమని తేల్చి చెప్పారు.

**ఏపీ పోలీసులపై పట్నా కోర్టు ఫైర్.. సునీల్ నాయక్ అరెస్టుకు 'నో'**

ఈ క్రమంలో సునీల్ నాయక్ తరపు న్యాయవాదులు సోమవారం ఉదయం పట్నా కోర్టును ఆశ్రయించారు. బిహార్ ఐపీఎస్ అధికారిని ఏపీ పోలీసులు అక్రమంగా అరెస్టు చేసేందుకు యత్నిస్తున్నారని న్యాయమూర్తి దృష్టికి తెచ్చారు. ఓ ఐపీఎస్ అధికారి నివాసంలోకి ఎస్పీ దామోదర్ నేతృత్వంలోని ఏపీ పోలీసుల బృందం గోడదూకి చొరబడటంపై న్యాయస్థానం తీవ్రంగా స్పందించింది. ఒకానొక దశలో ఏపీ పోలీసులను అరెస్టు చేసేందుకు ఆదేశిస్తామని కూడా హెచ్చరించింది. దీంతో ఏపీ పోలీసులు అప్పటికప్పుడు ఆగమేఘాలపై పట్నా కోర్టులో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేశారు. సునీల్ నాయక్‌ను అరెస్టు చేశామని చెబుతూ, ఏపీకి తీసుకువెళ్లేందుకు ట్రాన్సిట్ వారెంట్ జారీ చేయాలని కోరారు. దీనిపై బిహార్ పోలీసుల తరపు న్యాయవాదులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అసలు సునీల్ నాయక్ పేరు ఎఫ్ఐఆర్‌లో లేదని.. ఆయనకు వ్యతిరేకంగా ప్రాథమిక ఆధారాలే లేవని సుప్రీంకోర్టు పేర్కొన్న విషయాన్ని హైకోర్టుకు నివేదించారు. అనంతరం సునీల్ నాయక్‌ను నిందితుడిగా చేర్చి నోటీసులు జారీ చేయగా పట్నా హైకోర్టు నుంచి మధ్యంతర రక్షణ పొందిన విషయాన్ని గుర్తు చేశారు. విచారణకు సహకరిస్తారని, ఆయనపై కఠిన చర్యలు తీసుకోవద్దని కోర్టు ఆదేశించిన విషయాన్ని ప్రస్తావించారు. ంసునీల్ నాయక్‌పై ఏపీ పోలీసులు పెట్టిన కేసును క్వాష్ చేయాల్సిందిగా ఏపీ హైకోర్టులో పిటిషన్ వేస్తామని నివేదించారు. ఇరు వర్గాల వాదనలు విన్న అనంతరం పట్నా కోర్టు సునీల్ నాయక్‌కు అనుకూలంగా ఆదేశాలు జారీ చేసింది. ఆయన్ను అరెస్టు చేసేందుకు అనుమతించేది లేదని తేల్చి చెప్పింది. సునీల్ నాయక్‌కు వ్యతిరేకంగా ట్రాన్సిట్ వారెంట్ జారీ చేసేందుకు నిరాకరించింది. సునీల్ నాయక్‌పై 30 రోజుల వరకూ ఎటువంటి చర్యలు తీసుకోవడానికి వీల్లేదని స్పష్టం చేస్తూ ఉత్తర్వులు వెలువరించింది. దాంతో ఎస్పీ దామోదర్ బృందం బిహార్‌లో భంగపాటుకు గురైంది.

**ఏపీ డీజీపీ ఒం బిహార్ డీజీపీ**

సునీల్ నాయక్ అక్రమ అరెస్టు పన్నాగం బెడిసికొట్టడంతో నాలు క కరుచుకున్న ఏపీ పోలీసులు డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తాను ఫోన్‌లో బిహార్ డీజీపీ వినయ్‌కుమార్‌తో మాట్లాడించినట్లు సమాచారం. సునీల్ నాయక్‌ను అరెస్టు చేసేందుకు సహకరించాలని కోరడంపై బిహార్ డీజీపీ తీవ్రంగా స్పందించినట్లు తెలిసింది. 'ఐజీ సునీల్ నాయక్ నా పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఐపీఎస్ అధికారి. ంఈ రోజు ఏపీ పోలీసులు ఆయన నివాసంలో గోడ దూకి ప్రవేశించారు. ఆయన్ను ఎత్తుకు పోయేందుకు యత్నించారు. ఇందుకు అనుమతిస్తే భవిష్యత్‌లో నా బంగ్లాలోకి కూడా అక్రమంగా ప్రవేశించి నున్నూ ఎత్తుకుపోతారేమో..' అని తీవ్రంగా వ్యాఖ్యానించినట్లు సమాచారం. బిహార్ పోలీసులకు సమాచారం ఇవ్వకుండా.. స్థానిక ఎస్పీకి, చివరికి సంబంధిత పోలీసు స్టేషన్ అధికారికి కనీస సమాచారం ఇవ్వకుండా ఒక ఐపీఎస్ అధికారిని అపహరించేందుకు యత్నించడాన్ని తాము తీవ్రంగా పరిగణిస్తున్నామని స్పష్టం చేసినట్లు సమాచారం.

# కొనసాగుతున్న అంగన్వాడీల రిలే నిరాహార దీక్షలు

**కూటమి ప్రభుత్వం అంగన్వాడీ చెల్లెమ్మలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి**

రేణిగుంట స్వర్ణసాగరం ఫిబ్రవరి 23

అంగన్వాడి అక్క చెల్లెమ్మలకు ఎన్నికల ముందు తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మరియు సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సోమవారం నాడు రేణిగుంట ఐసిడిఎస్ కార్యాలయం వద్ద 2 రోజులు పాటు రిలే నిరాహార దీక్షలు సందర్భంగా మొదటి రోజు అంబికా, రాధమ్మ, గౌరీ, లీల, భూలక్ష్మి, రేవతి, శైలజ, రేవతి, హైమావతి, 9 మందికి పూలమాల వేసి రిలే నిరాహార దీక్ష శిబిరం లో కూర్చోవడం జరిగింది. అంగన్వాడీ దీక్షలకు మద్దతుగా సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కొండ్రెడ్డి హరినాథ్, కరీముల్లా, రేణిగుంట మండల కన్వీనర్ సెల్వరాజ్, ఐద్వా మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు కె.ఈశ్వరమ్మ, సిపిఎం పార్టీ సీనియర్ నేత వెంకటరమణ దీక్షా శిబిరంలో కూర్చొని వారికి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా అంగన్వాడి ప్రాజెక్టు అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి, ధనమ్మ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో 43 రోజులు సమ్మె చేస్తూ దీక్షలు చేపట్టామని ఆనాడు ప్రభుత్వం అంగన్వాడి వర్కర్లు, హెల్పర్లు డిమాండ్లు పరిష్కరిస్తామని రాతపూర్వకంగా రాసి ఇచ్చి మాట తప్పిందని, తెలుగుదేశం కూటం ప్రభుత్వం అధికారంలోకొస్తే అక్క చెల్లెమ్మల డిమాండ్లన్నీ పరిష్కరిస్తామని ఎన్నికల సందర్భంగా హామీలు ఇచ్చి రెండు సంవత్సరాలు అవుతున్న ఇంతవరకు మా బాధలు తీర్చలేదని అందుకే మండల కేంద్రంలో రెండు రోజులు, జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద మూడు రోజులు రిలే నిరాహార దీక్షలకు సిఐటియు నాయకత్వం లో రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలకు పిలుపు ఇవ్వడం జరిగిందని తెలిపారు. అంగన్వాడీలకు ఇస్తున్న 11,500రూ. వేతనం నుండి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం 26 వేల రూపాయలు వరకు జీతం పెంచాలని డిమాండ్ చేశారు. వేసవి సెలవులు, వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు, మెనూ చార్జీలు పెంపు, గ్యాస్ సిలిండర్లను ప్రభుత్వం సప్లై చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అంగన్వాడీలకు వర్తింపు చేయాలని, ఇంటి స్థలాలు మంజూరు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ 5 లక్షలు ఇవ్వాలని, గ్రాడ్యువిటీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రేణిగుంట మండలం, ఏర్పేడు మండలం కలిసి అంగన్వాడి టీచర్లు ఈ రిలే నిరాహార దీక్షలో పాల్గొన్నారు.




## బాగా పనిచేసే ఉద్యోగులకు వెయిటేజ్

-మొదటిపేజీ తరువాయి

సీఎం ఏమన్నారంటే..
ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మొదలుకొని అన్ని స్థాయిల్లో ఆసుపత్రుల్లో పారిశుద్ధ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలి.
పారిశుద్ధ్యం విషయంలో ఎన్నిసార్లు చెప్పినా పద్ధతి మార్చుకోని ఆసుపత్రుల జాబితా సిద్ధం చేయండి.
అక్కడి పొరుగుసేవల ఏజెన్సీని, సంబంధిత ఆసుపత్రి ఏవోలను బాధ్యులుగా చేయాలి.
గతంతో పోల్చితే ఆలయాల్లో సిబ్బంది పనితీరు కొంత బాగుంది. ఇంకా మెరుగుపడాలి.
ఆలయ పరిసరాల్లో ఆధ్యాత్మిక వాతావరణం ఉండేలా చూసే విషయంలో ఎట్టి పరిస్థితుల్లో నిర్లక్ష్యం వహించొద్దు.
భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందించేలా సిబ్బంది అంతా పనిచేయాలి.
అవినీతికి ఆస్కారం ఉండరాదు. ఏసీబీని రంగంలోకి దించే (యాక్టివేట్ చేసే) పరిస్థితి తెచ్చుకోవద్దు.
సరిగా పనిచేయని కారణంగా తహసీల్దార్లను పక్కన పెట్టాల్సిన దుస్థితి రాకూడదు.
మంచి పనితీరు కనబరిచే డిప్యూటీ కలెక్టర్లను గుర్తిస్తున్నాం.
రెవెన్యూ శాఖకు ఫ్రెష్‌లుక్ తీసుకురావాల్సి ఉంది. ఈ శాఖకు ఉన్న చెడ్డపేరు పోవాలి. పనితీరులో మార్పు కనిపించాలి.
రీ సర్వేతో అన్ని రకాల భూ సమస్యలు పోవాలి. మళ్లీ వివాదాలు రాకుండా చూడాలి.
ఎవరైనా సర్వేయర్లు సరిగా వ్యవహరించకపోతే కఠిన చర్యలు తప్పవు.
తాగునీటి పరీక్షలకు మొబైల్ ల్యాబ్‌లు
తాగునీరు కలుషితం కాకుండా ఎప్పటికప్పుడు నమూనాలు సేకరించి, ల్యాబ్‌ల్లో పరీక్షలు చేయించాలి.
ల్యాబ్‌లు అందుబాటులో లేకపోతే మొబైల్ ల్యాబ్‌లు అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలి.
రోడ్డు ప్రమాదాలపై ఆడిట్ చేయించాలి. దాని ఆధారంగా ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి.
ప్రభుత్వం పెద్దఎత్తున టెక్నాలజీ వినియోగించి సేవలు అందిస్తుండగా, వీటిపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.
ఇందుకు మీసేవ, డ్వాక్రా సంఘాలు, ప్రణాళిక విభాగంతో ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేయాలి.
ఇటీవల దిల్లీలో జరిగిన ఏఐ–ఇంపాక్ట్ సదస్సుల్లో రాష్ట్ర ప్రభుత్వం కుదుర్చుకున్న ఏడు ఎంవోయూలను ఎలా అమల్లో పెట్టాలనేదానిపై కార్యాచరణ సిద్ధం చేయాలి. ఈ సమీక్షలో రెవెన్యూ, ఆర్అండ్‌బీ, దేవాదాయ, వైద్యారోగ్య, పట్టణాభివృద్ధి, రవాణా, అగ్నిమాపక శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## తితిదేలో తప్పు చేసిన వారిపై క్రిమినల్ చర్యలు

-మొదటిపేజీ తరువాయి

కల్తీ నెయ్యి వ్యవహారంపై మంగళవారం శాసనసభలో ప్రత్యేక చర్చ చేపట్టనున్నారు. అధికార కూటమిలోని మూడు పార్టీలకు చెందిన సుమారు 10 మంది సభ్యులతో ఈ అంశంపై మాట్లాడించనున్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ గొంతు నొప్పి కారణంగా సోమవారం శాసనసభ సమావేశాలకు హాజరుకాలేదు. మంగళవారం కల్తీ నెయ్యిపై చర్చలో ఆయన పాల్గొని మాట్లాడతారని సమాచారం. చివర్లో సీఎం చంద్రబాబు ప్రకటన ఉంటుంది.

## హెరిటేజ్‌పై బొత్స వ్యాఖ్యలు అర్థరహితం

-మొదటిపేజీ తరువాయి

పెద్ద కంపెనీల కోసం తయారుచేస్తుంది. హెరిటేజ్‌తో పాటు అమూల్, బ్రిటానియా వంటి సంస్థలకు కావలసిన పాల ఉత్పత్తుల్ని తయారుచేసి ఇస్తుంది. దాన్ని కో ప్యాకేజింగ్ అంటారు' అని ఆయన వివరించారు. ఇందాపూర్ డెయిరీ నుంచి హెరిటేజ్ ఎప్పుడూ నెయ్యి కొనుగోలు చేయదని, స్కిమ్డ్ మిల్క్‌పౌడర్, అల్ట్రా హైటెంపరేచర్ మిల్క్ (యూహెచ్‌టీ), పన్నీర్, చీజ్ మాత్రమే ఆ డెయిరీ సరఫరా చేస్తుందని లోకేశ్ తెలిపారు. 'హెరిటేజ్ లిస్టెడ్ కంపెనీ. మా సంస్థపై వైకాపా నాయకులు సెబీకి ఫిర్యాదు చేశారు. ఏమైనా ఆధారాలు చూపించగలిగారా?' అని నిలదీశారు. 'సంబంధం లేని విషయంతో నాలుగు రోజులు శాసనమండలి సమావేశాలు జరగకుండా అడ్డుపడ్డ వైకాపా సభ్యులు.. ఇప్పుడు బడ్జెట్‌పై చర్చించాలని కోరడంలో అర్థం లేదు. సమావేశాల్ని అడ్డుకున్నప్పుడు వారికా విషయం తెలియదా?' అని లోకేశ్ ప్రశ్నించారు. తిరుమలకు కల్తీ నెయ్యి సరఫరా వ్యవహారంపై మంగళవారం శాసనసభలో చర్చిస్తామని తెలిపారు.


**జగన్ వస్తానంటే నేనే టికెట్ తీస్తా**

టీ–20 క్రికెట్ వరల్డ్‌కప్ పోటీల్లో భారత్ ఫైనల్స్‌కు చేరితే మ్యాచ్ చూసేందుకు కచ్చితంగా వెళ్తానని లోకేశ్ తెలిపారు. పులివెందుల ఎమ్మెల్యే వస్తానంటే ఆయనకూ టికెట్ తానే తీసుకుంటానని పేర్కొన్నారు. 'పార్టీలో సీనియర్లు, జూనియర్లకు సమానంగా ప్రోత్సాహం ఉంటుంది. నాయకులకు వారి సొంత బూత్‌లలో ఎన్ని ఓట్లు వచ్చాయన్నదాన్నిబట్టే పార్టీలో గుర్తింపు ఉంటుంది. నాతో సహా ఎవరికైనా ఇదే వర్తిస్తుంది. సొంత బూత్‌లోనే ప్రభావం చూపలేనివారు.. ఇక నాయకత్వం ఏమిస్తారు?' అని ఆయన వ్యాఖ్యానించారు.

## ప్రజల పట్ల అధికారులు

# నిర్లక్ష్యం వహిస్తే సహించేదిలేదు

**బీజేపీ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు పాపారెడ్డి పురుషోత్తం రెడ్డి**



స్వర్ణసాగరం వాకాడు

ప్రజల పట్ల అధికారులు నిర్లక్ష్యం వహిస్తే ఎట్టిపరిస్థితుల్లో సహించేదిలేదని, దుగరాజపట్నం పోర్టు ప్రాజెక్టు పేరుతో ప్రైవేట్ వ్యక్తులు, భూస్వాములకు లబ్ది కల్పించే ప్రయత్నాలను మానుకుని పేదరైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోలంటూ తిరుపతి జిల్లా బీజేపీపార్టీ ఉపాధ్యక్షులు పాపారెడ్డి పురుషోత్తంరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పనాబాక కోటేశ్వరరావు వాకాడు మండల తహసీల్దారుకు వినతిపత్రం అందచేశారు. ఆ సంధర్భంగా పురుషోత్తంరెడ్డి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వంలో బీజేపీ భాగస్వాములైనప్పటికీ తిరుపతి జిల్లా కలెక్టర్ నిర్లక్ష్యం, అధికారులకు బాధ్యత లేకపోవడం బాధాకరమని, వాకాడు మండలంలో భూస్వాములు ఆక్రమించిన 2000 నుంచి 3000 ఎకరాల చెరువులు, గుంటల ప్రభుత్వ భూములను వెంటనే విడి పించి ప్రత్యేక టీం ఏర్పాటు చేయాలని దుగరాజుపట్నం పోర్టు ప్రాజెక్ట్ పేరుతో ప్రైవేట్ వ్యక్తులు, భూస్వాములకు అన్యాయమైన లబ్ధి కల్పించే ప్రయత్నాలను తీవ్రంగా ఖండిస్తూ, పేదలు, రైతులకు న్యాయం జరగాలని, అవసరమైతే హైకోర్టులో పబ్లిక్ ఇంట్రెస్ట్ పిటిషన్ దాఖలు చేస్తామని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రెవిన్యూ మంత్రి సత్యనారాయణ, నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్తామని అధికారులను హెచ్చరించారు. అనంతరం పనబాక కోటేశ్వర రావు మాట్లాడుతూ దుగరాజుపట్నం పోర్టు భూసేకరణలో చిన్న రైతులకు, పెద్ద భూస్వాములకు సమాన నష్టపరిహారం ఇవ్వాలని, రికార్డుల తారుమారు చేసే అధికారులకు చర్యలు తప్పవంటూహెచ్చరించారు. చెరువుల ఆక్రమణలపై తక్షణ చర్యలు తీసుకోవాలని, తిరుపతి కలెక్టర్ నిర్లక్ష్యాన్ని తీవ్రంగా ఖండస్తున్నట్లు అయన తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ఎక్సక్యూటివ్ సభ్యులు కాళా వల్లిప్రసాద్ పాల్గొన్నారు.

swarna sagaram_Swarna sagaram.qxd 2/23/2026 11:20 PM Page 1



తిరుపతి
చిత్తూరు నెల్లూరు అనంతపురం
విలేకరులు కావలెను
సంప్రదించండి : 9440352036

# చివరి కాంప్లెక్స్ సమావేశం





## మహిళా ఉపాధ్యాయులు స్కిట్ సైన్స్ ఉపాధ్యాయుడు పుస్తకావిష్కరణ

**స్వర్ణ సాగరం ఓజిలి ఫిబ్రవరి 23: 2025-26**

విద్యాసంవత్సరం నకు సంబందించి ఓజిలి ఉన్నత పాఠశాలలో సోమవారం 2025- 26 విద్యా సంవత్సరంకు చివరి కాంప్లెక్స్ సమావేశము ఎంఈఓ లు శైలజ, చంద్రశేఖర్ నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్మేనిపాడు ఉన్నత పాఠశాలకు చెందిన భౌతికశాస్త్ర ఉపాధ్యాయులు గా పనిచేయుచున్న పి సురేందర్ రెడ్డి వ్రాసిన యువ మేధావులకు ప్రతిరోజు విజ్ఞానం అనే పుస్తకంను మండల విద్యాశాఖదికారులు శైలజ, చంద్రశేఖర్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శారదదేవి చేతుల మీదుగా ఆవిష్కరించడం జరిగినది. ఈ సమావేశం నందుమండలం లోని అన్నీ పాఠశాలల స్కూల్ అసిస్టెంట్స్ పాల్గొన్నారు. మండలవిద్యాశాఖది కారులకు మరియు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులను సన్మానించడం జరిగింది. తదుపరి యువ మేధావులకు ప్రతిరోజు విజ్ఞానం పుస్తకం వ్రాసిన ఉపాధ్యాయుడను పలువురు టీచర్లు ఎంఈఓ లు సన్మానించారు. అలాగే చివరి రోజు అయినందు వలన ఓజిలి కాంప్లెక్స్ లో ప్రైమరీ లెవెల్ మహిళా ఉపాధ్యాయులు అందరూ కలసి GFLN జి ఎఫ్ ఎల్ ఎన్ మీద ఒక స్కిట్ వేయడం జరిగినది. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు శ్రీనివాసులు, చక్రపాణి, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సేవకే జీవితాన్ని అంకితం చేసిన గొప్ప వ్యక్తి నల్లపరెడ్డి శ్రీనివాసులు రెడ్డి

## నల్లపరెడ్డి వినోద్ కుమార్ రెడ్డి

**కోట స్వర్ణసాగరం ఫిబ్రవరి 23**

నిరంతరం ప్రజాసేవకే జీవితాన్ని అంకితం చేసిన ప్రజా నాయకుడు నల్లపరెడ్డి శ్రీనివాసులు రెడ్డి అని టీడీపీ నేత నల్లపరెడ్డి వినోద్ కుమార్ రెడ్డి అన్నారు.కోట మండలం కోటలో సోమవారం నల్లపరెడ్డి వినోద్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో దివంగత నేత నల్లపరెడ్డి శ్రీనివాసరెడ్డి 33వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ నేపథ్యంలో నల్లపరెడ్డి శ్రీనివాసులు రెడ్డి విగ్రహానికి వినోద్ కుమార్ రెడ్డి నల్లపరెడ్ల అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొని పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వినోద్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ శ్రీనివాసులు రెడ్డి రాజకీయాలలోకి అడుగుపెట్టిన మొదటి నుండి తుది శ్వాస విడిచే వరకు ప్రజాసేవకే అంకితమై ఎంతోమంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించారని అసెంబ్లీకి ఒక్కరోజు కూడా సెలవు పెట్టకుండా,అసెంబ్లీలో సైతం తన గళాన్ని విప్పి అసెంబ్లీ టైగర్ అనే పేరు తెచ్చుకున్నారని అన్నారు. అధికారంలో ఉన్న లేకపోయినా తన గ్రామాన్ని తన ప్రాంత ప్రజలను ఏనాడు మరచిపోకుండా ప్రజాసేవకు అంకితమైన వ్యక్తి శ్రీనివాసులు రెడ్డి అని అన్నారు. అయినా మంత్రిగా ఉన్న సమయంలో రాష్ట్ర అభి వృద్ధి కోసం ఎంతో శ్రమించారని,ఆనాడు నిర్మించిన ప్రతి ప్రభుత్వ భవనాలపై, కార్యాలయాలపై,ఎక్కడ చూసినా నల్లపరెడ్డి శ్రీనివాసరెడ్డి పేరే కనిపిస్తుందని అభివృద్ధికి చిరునామా నల్లపరెడ్డి శ్రీనివాసులు రెడ్డి అని అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రగతి విద్యాసంస్థల అధినేత పసుపులేటి కిషోర్, కోట సర్పంచ్ ఇండ్ల వెంకట రమణమ్మ,ఉపసర్పంచ్ గాది విజయభాస్కర్,ఎంపీటీసీ షేక్ మొబీన్ బాష,మాజీ ఎంపీటీసీలు షేక్ యస్దానిబాష, తిరుమలశెట్టి ప్రసాద్,వార్డు మెంబరుబండి చిరంజీవి,ఆరిఫ్, ఆనందకృష్ణ మూర్తి, భారీ సంఖ్యలో నల్లపరెడ్డి అను చరులు, అభిమానులు,స్థానికులు తదిత రులు పాల్గొన్నారు.







# పీజీఆర్ఎస్‌కు ప్రాధాన్యం... అర్జీలకు వేగవంత పరిష్కారం

## దక్కిలి తహసీల్దార్ శ్రీనివాసులు

**స్వర్ణ సగరం దక్కిలి' ఫిబ్రవరి 23.**

తిరుపతి జిల్లా దక్కిలి మండలం "ప్రజల సమస్యలపై కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, నిర్ణీత గడువులోనే పరిష్కారం కావాలి" అని దక్కిలి తహసీల్దార్ శ్రీనివాసులు స్పష్టం చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా విజ్ఞప్తుల దినం (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన వినతులను స్వీకరించిన అనంతరం అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు.

**క్షేత్రస్థాయి పరిశీలనకు ఆదేశాలు** :పీజీఆర్ఎస్‌లో అందిన ప్రతి అర్జీపై వీఆర్వోలు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి, వాస్తవ పరిస్థితులను నివేదిక రూపంలో సమర్పించాలని తహసీల్దార్ ఆదేశించారు. సమస్యలను పెండింగ్‌లో ఉంచే ధోరణి అసలు ఉండకూడదని, వెంటనే సంబంధిత శాఖలకు పంపించి చర్యలు ప్రారంభించాలని సూచించారు."అర్జీ పరిష్కారానికి ఆలస్యం జరిగితే బాధితులకు కారణం స్పష్టంగా తెలియజేయాలి. అనిశ్చితి, నిర్లక్ష్యం చోటుచేసుకోకూడదు" అని ఆయన హెచ్చరించారు.

**రెవిన్యూ అంశాలపై ప్రత్యేక దృష్టి** : భూమి హక్కులు, సర్వే వివాదాలు, పాసుబుక్ల జారీ వంటి రెవిన్యూ సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని శ్రీనివాసులు పేర్కొన్నారు. గ్రామ స్థాయిలోనే సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటే ప్రజలు కార్యాలయాలకు తిరగాల్సిన పరిస్థితి ఉండదన్నారు.





**సమన్వయంతోనే ఫలితాలు** : పీజీఆర్ఎస్‌లో వచ్చిన అర్జీల పరిష్కారానికి వివిధ శాఖల మధ్య సమన్వయం కీలకమని ఆయన స్పష్టం చేశారు. ప్రతి విభాగం బాధ్యతాయుతంగా వ్యవహరించి, ప్రజా విజ్ఞప్తుల దినాన్ని కేవలం వినతులు స్వీకరించే కార్యక్రమంగా కాకుండా, ఫలితాల వేదికగా మలచాలని సూచించారు.

**పెరుగుతున్న ప్రజల నమ్మకం** :ప్రజా విజ్ఞప్తుల దినం ద్వారా తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లగలమనే నమ్మకం ప్రజల్లో పెరుగుతోందని ఆయన వివరించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.నిర్ణీత గడువుల్లో స్పందన, క్షేత్రస్థాయి పరిశీలన, పారదర్శకతతో పనిచేయాలని దక్కిలి తహసీల్దార్ శ్రీనివాసులు స్పష్టం చేశారు. ప్రజల సమస్యల పరిష్కారంలో వేగం, బాధ్యతాయుత వైఖరి ప్రధానమని పేర్కొన్నారు.

**దక్కిలి హైస్కూలు కు క్రీడా మైదానం కు స్థలం కేటాయించండి** : దక్కిలి హైస్కూలు విద్యార్థులకు క్రీడా మైదానం ఏర్పాటు చేయాలని, అందుకు అవసరమైన స్థలం ఇవ్వాలని ఎంఈవోలు జగదీష్ బాబు, వెంకటేశ్వర్లు, మండల టీడీపీ అధ్యక్షులు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి ఆద్వర్యంలో పీజేఆర్ ఎస్ లో అర్జీ అందజేశారు. ఈ విషయం పై క్షేత్రస్థాయి పరిశీలన చేసి స్థలం కేటాయిస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు.

# ఏపీ జెన్కో ఎండి ని కలిసిన భూనిర్వాసితులు ,కాంట్రాక్ట్ కార్మికులు.





## 350 శాశ్వత పోస్టులను భర్తీ చేయండి

**ముత్తుకూరు... ( స్వర్ణసాగరం)**

రాష్ట్ర ప్రభుత్వ ఏపీ జెన్కో ప్రాజెక్ట్ మేనేజింగ్ డైరెక్టర్ పుల్లారెడ్డిని సోమవారం ప్రాజెక్టు వద్ద నేలటూరు నిర్వాసితులు తోపాటు కాంట్రాక్ట్ కార్మికులు కలిసి పలు సమస్యలను విన్నవించారు. సోమవారం ఆయన పరిపాలన పరమైన అంశాలపై ప్రాజెక్టుకు విచ్చేయగా కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. జీఓ నంబర్ 438 ప్రకారం విడుదలైన 350 శాశ్వత పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా అర్హులైన భూనిర్వాసితులందరినీ శాశ్వతంగా నియమించాలని కోరారు. గత 15 సంవత్సరాలుగా ఏపీ జెన్కోలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు వారి అనుభవం, అర్హతల ఆధారంగా తగిన కేటగిరీలు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. స్టేజ్--2లో పని చేస్తూ స్కిల్డ్ నుంచి డీప్రోమోట్ చేసిన 39 మంది ను మళ్లీ స్కిల్డ్ కేటగిరీ ఇవ్వాలని చెప్పారు. అదేవిధంగా నేలటూరు గ్రామ పంచాయతీ పరిధిలో నూతన గృహాల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని, హరిజనవాడ గ్రామానికి ఇప్పటివరకు భూసేకరణ జరగకపోవడంతో వెంటనే భూసేకరణ పూర్తి చేసి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అభ్యర్థించారు. నేలటూరు పాలెం గ్రామంలో మిగిలిన సగం ఇళ్లకు భూసేకరణ పూర్తిచేసి గృహ నిర్మాణాలను తక్షణమే చేపట్టాలని తెలియజేశారు. వారి వినతులను శ్రద్ధగా విన్న మేనేజింగ్ డైరెక్టర్ సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ప్రతినిధులు తెలిపారు. ఈ సమావేశంలో పెద్ద సంఖ్యలో భూనిర్వాసితులు పాల్గొన్నారు.

# పొలకల ఆయుష్ శాఖ వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



**ఐరాల, స్వర్ణ సాగరం ఫిబ్రవరి 23 :**

యూకో బ్యాంక్ వద్ద ఉచిత వైద్య శిబిరం. ఐరాల మండలం యూకో బ్యాంక్ వద్ద పొలకల ఆయుష్ శాఖ వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి సుమారు 150 మంది మహిళలు వృద్ధులు సేవలు పొందారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి. శ్రావణి మెడికల్ ఆఫీసర్, బ్యాంకు మేనేజర్ ఎస్ భానుచందర్ అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ మౌనిక సురేంద్ర భాను ప్రకాష్ దీక్షతి జవహర్ ఈ దేవరాజులు మరియు వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# పల్లె నిద్ర కార్యక్రమంలో ఐరాల ఎస్ ఐ జయశ్రీ



**ఐరాల , స్వర్ణ సాగరం ఫిబ్రవరి 23**

ప్రజలను అప్రమత్తం చేస్తున్న ఎస్సై జయశ్రీ. జిల్లా ఎస్పీ తుషార డ్యూడీ ఆదేశాల మేరకు ఐరాల మండలం 35 యల్లంపల్లి గ్రామంలో నిర్వహించిన పల్లెనిద్ర కార్యక్రమంలో ఐరాల ఎస్సై జయశ్రీ ప్రజలతో మాట్లాడుతూ గ్రామాల్లో రాత్రిపూట అప్రమత్తంగా ఉండాలని ప్రస్తుత బంగారు ధర అధికంగా ఉండడంతో దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయని ప్రజలను అప్రమత్తం చేశారు, ఎవరైనా అపరిచిత వ్యక్తులు కనపడితే అప్రమత్తంగా ఉండాలని పోలీస్ స్టేషన్ కు ఇన్ఫర్మేషన్ ఇవ్వాలని తెలియజేశారు. గ్రామాల్లో ఎవరైనా అసంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు, మద్యం సేవించి వాహనాలు నడపరాదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ ప్రజలు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు నైతిక విలువలు పెంపొందించుకోవాలి



**స్వర్ణ సాగరం బుచ్చినాయుడు కండ్రిగ**

తిరుపతి జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల మేర కు జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశా లల్లో ప్రధానోపాధ్యాయులు రమణయ్య ఆధ్వర్యంలో విద్యార్థులకు చాగంటి కోటేశ్వరరావు విలువలు తో కూడిన విద్యకు సంబంధించి ప్రవచన వీడియోలను మండల విద్యాశాఖ అధికారి ముని సుబ్రహ్మణ్యం అధ్యక్షతన విద్యార్థులకు వీడియోలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వీడియోలు ద్వారా విద్యార్థులు ఆసక్తిగా వీక్షించి విద్యార్థి జీవితానికి సంబంధించిన నైతిక విలువలు, సంస్కారం మరియు సద్గుణాల నైపుణ్యతలను తెలుసుకొని మంచి పౌరులుగా ఎదగాలనే సంకల్పంతో జిల్లా విద్యాశాఖ అధికారులు విద్యార్థులకు ఈ వీడియోలను చూపించడం జరిగిందన్నారు. విద్యార్థుల జీవితాలకు నైతిక విలువలు ఎంతో ఉపయోగపడతాయని వాటిని అనుసరించుకోవాలని ఈ సందర్భంగా తెలిపారు ఈ కార్యక్రమంలో పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు శ్రీనివాసులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ తోనే అభివృద్ధి సాధ్యం

## కాంగ్రెస్ నాయకులు మల్లం అనిల్



**స్వర్ణసాగరం డోర్నకల్ ఫిబ్రవరి 23**

కాంగ్రెస్ తోనే అభివృద్ధి సాధ్యమవుతుందని కాంగ్రెస్ నాయకులు మల్లం అనిల్ అన్నారు. ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్రనాయక్ సహకారంతో పదో వార్డులోని కుందోజు వారి వీధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను సోమవారం వారు పర్యవేక్షించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత పదేళ్ల పాలనలో మురికి కూపాలుగా మారిన కాలనీల్లో డ్రైనేజీలు, సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టి కాలనీలను సుందరంగా మార్చిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందని ఆయన స్పష్టం చేశారు.

swarna sagaram_Swarna sagaram.qxd 2/23/2026 11:20 PM Page 2



## ముత్తుకూరులోని పారిశుధ్య నిర్వహణ అవగాహన.



ముత్తుకూరు... స్వర్ణ సాగరం

అదానీ కృష్ణపట్నం పోర్ట్ లిమిటెడ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జగదీష్ పటేల్ అదానీ ఫౌండేషన్ మార్గదర్శకత్వంలో ముత్తుకూరు గ్రామ పంచాయత్‌లోని ముత్తుకూరు గ్రామంలోని సింహాద్రినగర్‌లో పారిశుధ్య నిర్వహణ ప్రచారాన్ని నిర్వహించి, గ్రామ పారిశుధ్యాన్ని ఎలా మంచి పద్ధతిలో ఉంచుకోవాలో గ్రామస్తులకు తెలిపారు. ఇంటి పరిసరాలతోపాటు, గ్రామ వీధులను, రోడ్లను శుభ్రంగా ఉంచుకోవాలని, చెత్త మరియు విస్మరించిన వస్తువులను గ్రామానికి దూరంగా ఒకే చోట వేయాలని వివరించారు.ఈ సందర్భంగా అదానీ కృష్ణపట్నం పోర్ట్ లిమిటెడ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జగదీష్ పటేల్ మాట్లాడుతూ, అదానీ ఫౌండేషన్ జూ= బృందం ద్వారా సింహాద్రినగర్ గ్రామస్తులను గ్రామ పారిశుద్ధ్య ప్రచారాన్ని కొనసాగించడాం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

## ఇంటర్ పరీక్షలకు 174 మంది హాజరు



ముత్తుకూరు.. (స్వర్ణ సాగరం)

మండల కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకులం జూనియర్ కళాశాలలో సోమవారం ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించారు. మొత్తం 178 మంది విద్యార్థులు పరీక్షకు నమోదు కాగా, వారిలో 174 మంది మాత్రమే హాజరయ్యారు. నలుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. పరీక్షా కేంద్రంలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేపట్టడంతో పాటు, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పర్యవేక్షణ నిర్వహించారు. విద్యార్థులు సకాలంలో హాజరై పరీక్షలు రాసినట్లు కళాశాల యాజమాన్యం పేర్కొంది. పరీక్షల సందర్భంగా కేంద్రం వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయగా, అధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించారు.

## జలదార పరమేశ్వరుడికి విశేష అభిషేకాలు...



కోవూరు, స్వర్ణ సాగరం, ఫిబ్రవరి 23:

కోవూరు మండలంలోని పోతిరెడ్డి పాలెం వద్ద పవిత్ర పినాకిని తీరాన వెలసి ఉన్న శ్రీ ఇష్టకామేశ్వరి దేవి జలధార పరమేశ్వర స్వామివారికి విశేష పూజలు జరిగాయి.. వేదమంత్రాలు శివనామస్మరణతో స్వామివారికి విశేషాలు నిర్వహించారు. ప్రత్యేక పుష్పాలతో అత్యంత సుందరంగా స్వామి, అమ్మవార్లను అలంకరించారు. ఉభయకర్తలు,ఆలయ కమిటీ సభ్యులు కలికి శ్రీధర్ రెడ్డి, సీహెచ్ శ్రీనివాసులు, నందకుమార్ ప్రత్యేకంగా విశేషాలంకారాలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గాదిరాజు భాస్కర రావు, జెఎల్ సత్యం, సుధాకర్ యాదవ్, రాజా, నరసింహ, శ్రీనివాసరాజు ,కైలాసం శ్రీనివాసులు, నందకుమార్, విజయ్, శ్రావణ్, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. నందకుమార్ పుట్టినరోజును పురస్కరించుకొని నందకుమార్ కి ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేకంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ద

## నారాయణ డెంటల్ కాలేజీలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం



.నెల్లూరు స్వర్ణసాగరం ఫిబ్రవరి 23

అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవంపురస్కరించుకొని స్థానికనారాయణ డెంటల్ కళాశాలలో విద్యార్థుల కు నెల్లూరు జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో 23.2.2026 సోమవారం మధ్యాహ్నం రెండు గంటలకు ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలుగు భాషా వికాశం పై విద్యార్థులకు కవిసమ్మేళనం,ఉపన్యాస పోటీలను నిర్వహించి బహుమతులను అందచేశాము.ఈ కార్యక్రమం లో ముఖ్య అతిధి గా నెరసం కార్యదర్శి డా. పాతూరి అన్నపూర్ణ ప్రత్యేక అతిధిగా నెరసం అధ్యక్షులు ఎ. జయ ప్రకాష్ కళాశాల ప్రిన్సిపాల్ అజయ్ రేగిన్నాల్డ్ డీన్ నువ్వుల శివకుమార్ ప్రొఫెసర్ కన్నణ్ , కవులు ఎ.భారతి, అరుణ సందడి, సయ్యద్ నజ్మా షమ్మీ విద్యార్థులు పాల్గొన్నారు.విద్యార్థులకి తెలుగు భాష పై జరిగిన కవిసమ్మేళనం లో ప్రధమ బహుమతి సమీఖ్య, ద్వితీయ బహుమతి శ్వేత శేఖర్, తృతీయ బహుమతి డా. కృష్ణ కుమార్ లకు ప్రదానం చేయడం జరిగింది. కార్యక్రమం సి. వాసవి వందన సమర్పణ తో ముగిసింది.

# పారిశ్రామికవేత్త రఘురాం చౌదరి ని కలిసిన పూతలపట్టు నియోజకవర్గ జనసేన నాయకులు

### రఘురాం చౌదరి నీ జనసేన పార్టీలోకి ఆహ్వానించిన చిత్తూరు ఉమ్మడి జిల్లా కార్యదర్శి ఏపీ శివయ్య

ఐరాల, స్వర్ణ సాగరం ఫిబ్రవరి 23

పారిశ్రామికవేత్త రఘురాం చౌదరి ని మర్యాద పూర్వకంగా కలిసిన పూతలపట్టు నియోజవర్గం జనసేన పార్టీ నాయకులు. పూతలపట్టు నియోజకవర్గం జనసేన పార్టీ నాయకులు ప్రముఖ పారిశ్రామికవేత్త రఘురాం చౌదరి ని మర్యాదపూర్వకంగా కలిసి పార్టీలోకి ఆహ్వానించారు. సందర్భంగా జనసేన పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శి ఏపీ శివయ్య మాట్లాడుతూ జనసేన పార్టీలో చేరితే జనసేన పార్టీ మరింత ఎన్డీఏ కూటమికి నియోజకవర్గం లో మరింత బలం చేకూరుతుందని పేర్కొన్నారు. రఘురాం చౌదరి భావజాలం ఆశయాలు సిద్ధాంతాలు క్రమశిక్షణ ఇవన్నీ అధినేత పవన్ కళ్యాణ్ ఆలోచనకు విధి విధానాలకు చాలా దగ్గరగా ఉన్నాయని ఆయన జనసేన పార్టీలో పనిచేయడం పార్టీతోపాటు ఈ ప్రాంత ప్రజలకు కూడా మేలు జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు జిల్లా సంయుక్త కార్యదర్శి నెహ్రూ రాయల్, యాదమరి మండల అధ్యక్షుడు కుమార్, ఉపాధ్యక్షుడు ఢిల్లీ సుల్తాన్, పీఏసీ డైరెక్టర్ ప్రభాకర్, తవణంపల్లి మండల ప్రధాన కార్యదర్శి ఉదయ్, అజిత్ చిన్న యువరాజ్ తేజ సోషల్ మీడియా ఇన్ఫోమెన్ సర్ హరితేజ ఐరాల మండల జనసేన పార్టీ అధ్యక్షుడు పురుషోత్తం, ఉపాధ్యక్షుడు నవీన్ జిల్లా సీనియర్ నాయకులు మహేష్ స్వేరో, ఆవుల శాంతమూర్తి, బంగారుపాళ్యం మండల ప్రధాన కార్యదర్శిలు పవన్ అనిల్ కిషోర్ మరియు పూతలపట్టు నియోజకవర్గంలోని వివిధ మండలాల జనసైనికులు పాల్గొన్నారు.



# “పద్మభూషణుడు” శాంతా బయో టెక్నిక్స్ అధినేత కోడూరు ఈశ్వర వరప్రసాదరెడ్డి పొగడ్తలతో ముంచేత్తినఎంపీ వేమిరెడ్డి







తోటపల్లి గూడూరు స్వర్ణ సాగరం ఫిబ్రవరి 23

రాష్ట్రపతి ద్వారా పద్మభూషణ్ అవార్డు అందుకున్న శాంతాబయోటెక్నిక్స్అధినేత కోడూరు ఈశ్వర రెడ్డి అని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిఆయనను పొగడ్తలతోముంచెత్తారు మండల కేంద్రంఇసుకపాలెం లో శాంతా--వసంతా ట్రస్ట్ మరియు శంకర నేత్రాలయ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 15 నుంచి నిర్వహించిన మెగా కంటి వైద్య శిబిరం సోమవారం ముగిసింది. ముఖ్య అతిథిగా నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి హాజరై, వైద్య బృందాన్ని గ్రామానికి తీసుకువచ్చిన కోడూరు ఈశ్వర వరప్రసాద్ రెడ్డి--వసంతా దంపతులను అభినందించారు. 9 రోజుల్లో 900 మందికి పరీక్షలు, 100 మందికి కాటరాక్ట్ శస్త్రచికిత్సలు చేసి సుమారు రూ.50 లక్షల విలువైన సేవలు ఉచితంగా అందించారని తెలిపారు. 1993లో శాంతా బయోటెక్నిక్స్ స్థాపించి హెపటైటిస్–బి వ్యాక్సిన్ రూపొందించిన, 2005లో పద్మభూషణ్ అందుకున్న వరప్రసాద్ రెడ్డి సేవలను కొనియాడారు. విపిఆర్ ఫౌండేషన్ నేత్ర బస్సు ద్వారా ఉదయగిరి పరిధిలో 5 మండలాల్లో 26 వేల మందికి పరీక్షలు, 15 వేల మందికి అద్దాలు అందించామని తెలిపారు. వరప్రసాద్ రెడ్డి గ్రామీణులకు మెరుగైన చూపు కల్పించడమే లక్ష్యమన్నారు. ఈకార్యక్రమంలో కోడూరు చంద్రశేఖర్ రెడ్డి కుటుంబ సభ్యులు, కోడూరు కమలాకర్ రెడ్డి,చిన్న బాబు రెడ్డి, సోమిరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, ముత్యాల శ్రీనివాసులు,కేతంరెడ్డి వినోద్ రెడ్డి, గుడి హరిరెడ్డి, కదురు సుబ్బయ్య, చైతన్య, స్థానిక నాయకులు, సర్పంచ్లు, గ్రామస్తులు, శంకర నేత్రాలయ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ధర్తీ ఆబా జన్జాతీయ గ్రామఉత్కర్ష్ అభియాన్కార్యక్రమం




స్వర్ణ సగరం దక్కిలి, ఫిబ్రవరి 23

తిరుపతి జిల్లా దక్కిలి మండలం కందలవారిపల్లి లో ధర్తీ ఆబా జన్జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ కార్యక్రమం కింద దక్కిలి మండలం లోని కందలవారిపల్లి గ్రా ఎశీశ్రీశీఅఎ ను ప్రభుత్వం ఎంపిక చేశారు. కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాల సహకారం తో గ్రా ఎశీశ్రీశీఅఎ ను అభివృద్ధి చేయడం ప్రధాన ఉద్యేశం. అందులో భాగంగా పశు సంవర్ధక శాఖ తరపున గొర్రెల, మేకల, కోళ్ల, పందుల యూనిట్లను 90 శాతం తో ప్రభుత్వం అందిస్తున్నారు. ఆ మేరకు పశు సంవర్ధక శాఖ కందలవారిపల్లి లో ఆ గ్రామ ప్రజల తో సమావేశం నిర్వహించి ఆ కార్యక్రమం యొక్క విధివిధానాలు, కావాల్సిన పత్రాలు, అర్జీ దారుల అర్హతలు మొదల గు విషయాలను ణతీ వీ. శ్రీహరి, సహాయ సంచాలకులు, ఏరియా పశు వైద్య శాల, వెంకటగిరి మరియు ణతీ ూ. కిషోర్ కుమార్, పశు వైద్యాధికారి, దక్కిలి తెలియజేశారు. ఈ కార్యక్రమం కు శ్రీ గోను రాజశేఖర్ , మండలధ్యక్షులు, దక్కిలి, శ్రీ కోటేశ్వర రెడ్డి , మండల నాయకులు, వీూణూ దక్కిలి , దక్కిలి నాయకులు మరియు పశు సంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## నాయుడుపేట ఐసిడిఎస్ వద్ద అంగన్వాడీల రిలే నిరాహార దీక్షలు.



స్వర్ణసాగరం (నాయుడుపేట) ఫిబ్రవరి 23.

తిరుపతి జిల్లా నాయుడుపేట లో దీర్ఘకాలంగా తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం నాయుడుపేట ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట నాయుడుపేట,పెళ్ళకూరు,ఓజిలి మండలాల అంగనవాడిలు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు.ఈ సందర్భంగా సిఐటియు నాయకులు శివకవి ముకుంద,అంగన్వాడి ప్రాజెక్టు కార్యదర్శి శ్యామలమ్మ మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీలను చులకనగా చూస్తున్నాయన్నారు.కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో ఐసిడిఎస్ ప్రస్థాపన లేదన్నారు.బడ్జెట్లో ఐసిడిఎస్ కు నిధులు పెంచాలన్నారు.ఎఫ్ ఆర్ ఎస్ రద్దు చేయాలని,జి ఏ ఎస్ అమలు చేయాలని,కనీస వేతనం 26,000 ఇవ్వాలన్నారు.అంగన్వాడీలకు గ్రాట్యుటి అమలు చేయాలని,ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అంగన్వాడీలకు వర్తింపజేయాలన్నారు.అంగన్వాడిల రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలకు సిఐటియు అండగా ఉంటుందన్నారు.వారి న్యాయమైన డిమాండ్లను అమలు చేయాలని లేని పక్షంలో ఈ పోరాటాన్ని ఉధృతం చేస్తామని అన్నారు.

## డోర్నకల్ మున్సిపాలిటీలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

స్వర్ణసాగరం డోర్నకల్ ఫిబ్రవరి 23



డోర్నకల్ మున్సిపాలిటీకు చెందిన తేజావత్ సేల్యాకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు మంజూరైన సందర్భంగా సోమవారం కీలక పరిణామం చోటుచేసుకుంది. చెక్కులో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో, ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్ర నాయక్ ఆదేశాల మేరకు దాసరి నాని యాదవ్ హైదరాబాద్‌కు వెళ్లి సచివాలయంలో అధికారులతో చర్చలు జరిపారు.అనంతరం కొత్త చెక్కును మళ్లీ మంజూరు చేయించి బాధితురాలికి అందజేసే చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, అవసరమైన వారికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సహాయం అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా తమ దృష్టికి తీసుకొస్తే తక్షణమే పరిష్కారం చూపిస్తామని ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్ర నాయక్ పేర్కొన్నారు. వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించినందుకు స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఎమ్మెల్యే రామచంద్రనాయక్ కు రుణపడి ఉంటాం

### 13వ వార్డు కౌన్సిలర్ యల్లావుల సువర్ణ హరికృష్ణ




స్వర్ణసాగరం డోర్నకల్ ఫిబ్రవరి 23

అభివృద్ధికి నోచుకోని డోర్నకల్ పట్టణంలోని 13వ వార్డులో ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే డాక్టర్ రామ చంద్ర నాయక్ ఆశీస్సులతో 13 వ వార్డు కౌన్సిలర్ యల్లావుల సువర్ణ హరికృష్ణ, ఆధ్వర్యం లో ఆ కాలనీకి సైడ్ కాలవ సీసీ రోడ్డు పనులను బద్దెల శ్రీను, ఇంటి నుంచి కొత్త శివ ఇంటి వరకు శరవేగంగా జరుగుతున్నాయి. ఆ కాలనీ గత 10 సంవత్సరాల క్రితం ఏర్పడిందని ఈ ప్రజా పాలనలో ఇప్పుడు అభివృద్ధి జరుగుతుందని 13వ వార్డు ఊరు చివర ఉన్న యాదవ్ నగర్ కాలనీ వాసులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు యల్లావుల హరికృష్ణ తెల్ల మేకల సుధాకర్ పండగ ఉపేందర్ పండగ సత్యనారాయణ వీరభద్రం, జాల శ్రీను కొత్త శివ, దాసరి శ్రీకాంత్, బడేటి రాజేష్, గురవయ్య, పాల్గొన్నారు .

swarna sagaram_Swarna sagaram.qxd 2/23/2026 11:20 PM Page 3



# రోటరీ క్లబ్ కార్యాలయం కి స్థలం కేటాయించండి.





అధికారులకు వినతిపత్రం అందజేసిన రోటరీ క్లబ్.

స్వర్ణ సాగరం (నాయుడుపేట) ఫిబ్రవరి 23.

23 02 26 తేదీన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నాయుడుపేట రోటరీ క్లబ్ ప్రెసిడెంటు నాగూరయ్య ఆధ్వర్యంలో క్లబ్ సభ్యులతో జిల్లా కలెక్టర్ వారి కార్యాలయంలో జిల్లా కలెక్టర్ అందుబాటులో లేని కారణంగా డిఆర్ఓ నరసింహులుకు రోటరీ క్లబ్ కు స్థలము మంజూరు చేయమని కోరుతూ వినతిపత్రం సమర్పించడం జరిగినది. అనంతరం సూళ్లూరుపేట రెవెన్యూ డివిజన్ అధికారి కిరణ్మయి వారికి సభ్యులందరూ సూళ్లూరుపేట ఆర్డీవో కార్యాలయంలో సంప్రదించి వినతి పత్రము అందించడమైనది. ఆర్డీవో స్థలము ఐదు సెంట్లు మంజూరు చేసేందుకు సుముకత వ్యక్తపరిచారు. తదుపరి స్థానిక ఎమ్మెల్యే గారిని కలిసేందుకు ప్రయత్నించగా ఎమ్మెల్యే గారు అసెంబ్లీలో ఉన్నందున మరొక సారి కలిసేటందుకు నిర్ణయించుకొనడమైనది. ఈ సందర్భంగా ప్రెసిడెంట్ నాగూరయ్య మాట్లాడుతూ గత 7 సంవత్సరాల నుంచి నాయుడుపేట రోటరీ క్లబ్ తరపున పేద విద్యార్థులకు విద్య, ఒంటరి మహిళలకు ఆర్థిక అభివృద్ధి కొరకు చేయూత, నిరుపేదలకు వైద్యం, కు అధిక ప్రాధాన్యతిస్తూ అనేక సేవా కార్యక్రమాలు చేయడం జరిగింది. కొన్ని పాఠశాల నందు మధ్యాహ్నం భోజనం చేయుటకు ఇబ్బంది పడుతున్న సమయంలో వారికి శాశ్వతంగా రేకుల షెడ్లు వేయడం జరిగింది. ఇప్పటివరకు విద్యార్థులకు 6000 జతలు ఉచితంగా పంపిణీ చేయటం జరిగింది. కాలేజీల నందు వారి అవసరార్థం కొన్ని షెడ్లు వేయడం జరిగింది అని ఇలా అనేక కార్యక్రమాలు చేస్తున్నాము ఈ కార్యక్రమాలన్నీ ఇంత విజయవంతంగా కావడానికి కారణం దాతలు సహకారం మ సభ్యుల యొక్క సహకారంతోనే దీని సాధించాము ప్రభుత్వం మాకు శాశ్వతంగా స్థలము కేటాయించడం వలన భవనం ఏర్పాటు చేసుకుని ప్రజలకు అందుబాటులో ఉంటూ అందులో పేదలకు మరిన్ని సేవా కార్యక్రమాలు చేసే అవకాశం ఉంటుంది కావున ప్రభుత్వము మా విన్నపాన్ని మన్నించి స్థలము కేటాయిస్తే అందులో పేద ప్రజలకు ఉపయోగపడే అనేక సంక్షేమ కార్యక్రమాలు చేస్తామని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ నాగూరయ్య, రోటరీ క్లబ్ సెక్రటరీ సుబ్రహ్మణ్యం, రోటరీ క్లబ్ సభ్యులు హరి, చంద్రశేఖర్, పాల్గొనడం జరిగినది.

# టిడిపి పార్టీని బలోపేతం చేయడమే మా లక్ష్యం..!

## మున్సిపల్ వైస్ చైర్మన్,టిడిపి పట్టణ అధ్యక్షుడు 786 రఫీ.

స్వర్ణ సాగరం (నాయుడుపేట) ఫిబ్రవరి 23.

తిరుపతి జిల్లా నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రధాన కూడలి వార్డుల వద్ద మున్సిపాలి వైస్ చైర్మన్,టిడిపి పట్టణ అధ్యక్షులు 786 రఫీ ఆధ్వర్యంలో "మై టిడిపి యాప్" పోస్టర్లను ఏర్పాటు చేస్తూ చేయడం జరిగింది.ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులు రఫీ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు ఆదేశాలు జాతీయ ప్రధాన కార్యదర్శి మంత్రి నారా లోకేష్ సూచనలతో సులూరుపేట శాసన సభ్యురాలు డాక్టర్ నెలవల విజయశ్రీ ఆదేశాల మేరకు ఆధునిక సాంకేతికను కార్యకర్తలకు ప్రజలకు చేరువ చేయాలని ప్రధమ ఉద్దేశంతో "మై టిడిపి యాప్"పోస్టర్లను నాయుడుపేట పట్టణంలోనీ 6,7 ,8,9,10,11,12,15,24 వార్డుల్లో ప్రజలకు కనబడే విధంగా అన్ని చోట్ల ఏర్పాటు చేయడం జరిగింది. అంతేకాకుండా స్థానిక కూటమి పార్టీ నాయకులు ప్రజలకు"మై టిడిపి యాప్"గురించి తెలియజేసి మొబైల్ ఫోన్లో ఇన్స్టాల్ చేసి ఆ వార్డులో ఉన్న సమస్యలపై ఎలా వినియోగించుకోవాలో అవగాహన తెలియజేయడం జరిగింది..ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులు 786 రఫీ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ సంక్షేమం అభివృద్ధి పై దృష్టి పెట్టడమే కాకుండా ప్రజా సమస్యలను గురించి తెలుసుకోవడానికి"మై టిడిపి యాప్" ను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.. "మై టిడిపి యాప్" గురించి ప్రజలు తెలుసుకొని ఆ యొక్క యాప్ లో సమస్యల గురించి నేరుగా తెలియజేస్తే మంత్రి నారా లోకేష్ బాబుకి నేరుగా ఆయన దృష్టికి వెళుతుందని ఈ యాప్ ప్రతి ఒక్కరు ఉపయోగించుకోవాలని కోరారు.అంతేకాకుండా కూటమి ప్రభుత్వ నాయకులు,కార్యకర్తలు అభిమానులు, ప్రజలు తప్పనిసరిగా యాప్ను డౌన్లోడ్ చేసుకుని వినియోగించుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పోలేరమ్మ ఆలయ కమిటీ చైర్మన్ నానబాల సుబ్బారావు, అవధానం సుధీర్,జువ్వలపాటి మస్తాన్,వినుకొండ ధనంజయ,టిడిపి సీనియర్ నాయకులు మొండం బాబు, పలుకూరు ముత్యాలయ్య,మాజీ వార్డు మెంబర్ నక్కినబోయిన నాగరాజు,నిత్యకృష్ణారెడ్డి,షరీఫ్, గిరి, తదితరులు పాల్గొన్నారు.



# ప్రారంభమైన ఇంటర్మీడియట్ ప్రధమ సంవత్సర పరీక్షలు.

## పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు.

## నాయుడుపేట అర్బన్ సిఐ వెంకటేశ్వర్లు.





స్వర్ణసాగరం (నాయుడుపేట) ఫిబ్రవరి 23.

తిరుపతి జిల్లా నాయుడుపేటలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించిన నాయుడుపేటలోని గుర్రపు శెట్టి ప్రభుత్వ జూనియర్ కళాశాల, వేమ, విశ్వం విక్రమ్, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల, 4 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగింది. నాలుగో కేంద్రాలలో మొత్తం 1200 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. పరీక్షా కేంద్రాలలో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు చోటు చేసుకోకుండా అధికారులు ప్రత్యేకమైన చర్యలు చేపట్టారు. ప్రతి పరీక్ష కేంద్రాలలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగింది. పరీక్ష సమయానికి గంట ముందే విద్యార్థులు ఆయా పరీక్ష కేంద్రాలు వద్దకు చేరుకున్నారు. అలాగే పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు 144 సెక్షన్ ను అమలు చేయడం జరిగింది. అదేవిధంగా పరీక్ష కేంద్రాలలో మాస్ కాపీయింగ్ కు అవకాశం లేకుండా సీసీటీవీ కెమెరాలను ఏర్పాటుచేసి పటిష్టంగా నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు..

# తన గ్రామస్తులు ఆధ్వర్యాన ఘనంగా ఒట్టూరు కిషోర్ యాదవ్ జన్మదిన వేడుకలు.



స్వర్ణ సాగరం (నాయుడుపేట)ఫిబ్రవరి 23.

తిరుపతి జిల్లా నాయుడుపేట మండలం అయ్యప్ప రెడ్డి పాలెం లో స్థానిక గ్రామస్తుల నడుమ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయుడుపేట మండల అధ్యక్షులు ఒట్టూరు కిషోర్ యాదవ్ జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు..అనంతరం అక్కడ ఉన్న గ్రామస్తులు,పెద్దలు, మహిళలు,విద్యార్థులు కలిసి భారీ కేకును ఏర్పాటు చేసి కిషోర్ యాదవ్ చేతుల మీదుగా కెకును కట్ చేపించారు. ముందుగా శాలువాలు కప్పి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి ఇలాంటి జన్మదిన వేడుకలను మరెన్నో జరుపుకోవాలని ఆ దేవుడు ఆశీస్సులు నీకు ఎప్పుడూ ఉండాలని కోరుకుంటూ గ్రామస్తులు తెలియజేశారు..

# సీఎం కప్ వెయిట్ లిఫ్టింగ్ లో బంగారు పధకం



స్వర్ణ సాగరం డోర్నకల్ ఫిబ్రవరి 23

తెలంగాణలో జరిగిన రాష్ట్రస్థాయి సీఎం కప్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో మహబూబాబాద్ జిల్లా చెందిన యం స్వాతి, మెరుగైన ప్రతిభ కనబరిచారు. 58,కేజీల విభాగంలో స్నాచ్లో 36 కేజీ, క్లీన్ అండ్ జర్క్లో 45 కేజీల బరువు ఎత్తి బంగారు పతకం సాధించారు. ఎల్బీ స్టేడియంలో జరిగిన ఈ పోటీల్లో ఆమె అద్భుతమైన ప్రతిభ కనబరిచి బంగారు పధకం అందుకున్నది. మహబూబాబాద్ జిల్లా వెయిట్ లిఫ్టింగ్ ప్రెసిడెంట్ మండలోజు సుధాకర్ , సెక్రెటరీ కొత్త రాంబాబు స్వాతిని అభినందించారు

# కల్వర్టును బాగు చేయండి.. డ్రైనేజీని మెరుగుపరచండి



ఏర్పేడు స్వర్ణసాగరం ఫిబ్రవరి 23

మండలంలోని పాపానాయుడు పేట మరియు మర్రిమంద సరిహద్దున గల బీసీ కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా వుంది. చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయి డ్రైనేజీ స్తంభించడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు.నిత్యం దోమలతో కలిసి జీవిస్తున్నామని పిల్లలు, వృద్ధులు దోమల బారిన పడి ఆసుపత్రి బాటపడుతున్నామని స్థానికులు మండిపడుతున్నారు.నివాసాల మధ్య నుండి వెళ్లే మురికి కాలువకి అడ్డంగా ప్రధాన రహదారి ఉండడంతో ఆర్ అండ్ బి అధికారులు కల్వర్టును నిర్మించారు.ప్రస్తుతం ఈ కల్వర్టు పూర్తిగా ధ్వంసమై మట్టితో కూరికిపోయింది.గత పదేళ్ల క్రితమే కల్వర్టు ధ్వంసమైనట్లు స్థానికులు చెబుతున్నారు.ఆర్ అండ్ బి అధికారులు కల్వర్టును బాగు చేయాల్సి వుండగా ఏ అధికారి కూడా ఇటువైపు కన్నెత్తి చూడలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇటీవల వర్షాకాలంలో కూడా వర్షపు నీరు కాలువ నిండి ఇళ్లల్లోకి వచ్చిందని స్థానికులు చెబుతున్నారు.నీరు ఎటు వెళ్లలేక స్తంభించడంతో దుర్వాసన, దోమల బెడతతో భరించలేకపోతున్నామని వాపోతున్నారు. స్థానికులు సిపిఎం నాయకులతో కలిసి గ్రామపంచాయతీ అధికారిని వివరణ కోరగా దెబ్బతిన్న కల్వర్టును ఆర్ అండ్ బి అధికారులు మాత్రమే బాగు చేయాలని, కల్వర్టు పూర్తయితే పంచాయతీ ద్వారా నూతన డ్రైనేజీ కాలువని నిర్మిస్తామని తెలిపారన్నారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ ఆర్ అండ్ బి అధికారులు స్పందించి నూతన కల్వర్టును నిర్మించి డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు రంగయ్య, రాంబాబు, వెంకటాద్రి తదితరులు పాల్గొన్నారు.

# స్వర్ణముఖి బ్రిడ్జి ఏర్పాటు చేయాలని అసెంబ్లీలో గల మెత్తిన ఎమ్మెల్యే డా.నెలవల విజయశ్రీ..!

## నాయుడుపేటలో హై లెవెల్ స్వర్ణముఖి బ్రిడ్జి ఏర్పాటు చేయడం ఖాయం.

స్వర్ణ సాగరం (నాయుడుపేట) ఫిబ్రవరి 23.




జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో తిరుపతి జిల్లా నాయుడుపేటలో స్వర్ణముఖి నదిపై హై లెవెల్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని సోమవారం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో సులూరుపేట నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ నెలవల విజయ శ్రీ మాట్లాడడం జరిగింది..ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయ శ్రీ మాట్లాడుతూ నాయుడుపేట/వెంకటగిరి రెండు నియోజకవర్గాలకు రాకపోకల కోసం 1980 సంవత్సరంలో ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు..నాయుడుపేట మండలం మేనకూరులో సేజ్ ఏర్పాటు చేయడంతో అక్కడ ఎన్నో కంపెనీలు ఉన్నాయని అన్నారు. ప్రతిరోజు నిత్యం నాయుడుపేట నుండే కాకుండా ఇతర జిల్లాల నుండి ఆ కంపెనీల వద్దకు సుమారు 300 నుండి 400 వాహనాలు ప్రతిరోజు పోతుంటాయని తెలిపారు. మేనకూరు సెజ్ కంపెనీలలో సుమారు వేలాదిమంది నిరుద్యోగులు పనిచేస్తున్నారని ఆ బ్రిడ్జిపైనే ప్రయాణం కొనసాగిస్తున్నారని అన్నారు.. అంతేకాకుండా ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చదువుకుంటున్నాను నిరుద్యోగులకు ఎన్నో కంపెనీలను తీసుకొని రావడం జరిగిందని అందుకోసం నాయుడుపేటలో హై లెవెల్ బ్రిడ్జిని ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును అసెంబ్లీలో కోరడం జరిగింది..అంతేకాకుండా నియోజకవర్గాల్లో ఎన్నో అభివృద్ధి సమస్యలపై కూడా మాట్లాడడం జరిగింది..

# ఉత్తమ పోస్టల్ బీపీఎంగా ఎంపికైన ఎ.అరుణ



బంగారుపాళ్యం.స్వర్ణసాగరం. ఫిబ్రవరి 23

ఫిబ్రవరి 23..2024--2025 ఆర్థిక సంవత్సరానికి కరిడివారిపల్లి గ్రామానికి చెందిన బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ ఎ.అరుణ ఉత్తమ బీపీఎంగా ఎంపికయ్యారు.పోస్టల్ శాఖ అభివృద్ధికి విశేష కృషి చేసినందుకు అమరావతిలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రులు జ్యోతిరాదిత్య సింధియా,పెమ్మసాని చంద్రశేఖర్ చేతుల మీదుగా ఈ గౌరవం దక్కింది.గత ఆర్థిక సంవత్సరంలో ఆమె ఆధ్వర్యంలో మొత్తం 524 కొత్త ఖాతాలు ప్రారంభించబడగా, 82 పోస్టల్ ఇన్సూరెన్స్ పాలసీలు నమోదు చేయబడ్డాయి.అదనంగా అత్యధిక మొత్తంలో ప్రీమియం వసూలు చేసి,562 డీబీటీ (డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్ఫర్ లావాదేవీలు విజయవంతంగా నిర్వహించారు.గ్రామీణ ప్రజలకు సమర్థవంతమైన పోస్టల్ సేవలు అందిస్తూ, ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో కీలక పాత్ర పోషించినందుకు ఈ అవార్డు ప్రదానం చేయబడింది.ఈ సందర్భంగా అరుణ మాట్లాడుతూ ఈ విజయం గ్రామ ప్రజల విశ్వాసం,ఉన్నతాధికారుల మార్గదర్శకత్వం మరియు సహచరుల సహకారం ఫలితమని పేర్కొన్నారు.భవిష్యత్తులో కూడా మరింత కృషి చేసి శాఖకు మంచి పేరు తీసుకురావాలని సంకల్పించారు.ఈ అవార్డు ఇండియా పోస్ట్ తరఫున ప్రదానం చేయబడింది.

# కోడి పందేల స్థావరాలపై పోలీసుల దాడి

## - బైకులు 21 - 5 పందెం కోళ్ళు స్వాధీనం

స్వర్ణ సాగరం, మనుబోలు :



కోడి పందాల స్థావరాలపై మనుబోలు పోలీసులు "ఆదివారం దాడులు" నిర్వహించారు... మండల పరిధిలోని బద్వేల్ శివారులో కోడి పందాలు నిర్వహిస్తున్నట్లుగా విశ్వాసనీయమైన సమాచారం మేరకు ఈ దాడులు జరిగినట్లు "మనుబోలు ఎస్ఐ యం శివ రాకేష్" వెల్లడించారు... ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాడుల్లో 8 మంది ముద్దాయిలను, రూ.800 నగదు, 5 పందెం కోళ్లు, బైకులు 21 ను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు...

# జొన్నగురకల కాలనీలో తాగునీటి సమస్య తీర్చాలని ఎంపీడీఓ కు వినతి



తవణంపల్లి.స్వర్ణసాగరం. ఫిబ్రవరి 23

చిత్తూరు జిల్లా తవణంపల్లి మండలం జొన్నగురకల గ్రామ పంచాయతీలో తాగునీటి సమస్య పరిష్కరించాలని తవణంపల్లి ఎంపీడీవోకు వినతిపత్రం సమర్పించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జొన్నగురకల కాలనీవాసులు తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని కాలనీలో సరైన నీటి సరఫరా లేకపోవడంతో మహిళలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో పంచాయతీ సెక్రటరీ రామరాజు ఆధ్వర్యంలో కాలనీవాసులు డిప్యూటీ ఎంపీడీవో రాజశేఖర్‌కు విన్నవించగా సమస్యను వివరంగా వినిన డిప్యూటీ ఎంపీడీవో రాజశేఖర్ వెంటనే స్పందించి తాగునీటి సరఫరా మెరుగుపరచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. త్వరలో సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

# సమాజ నిర్మాణంలో సేవా గుణమే గొప్పది

మాచిరెడ్డి శ్రీనాథరెడ్డి



స్వర్ణ సాగరం, మనుబోలు :

సమాజ నిర్మాణంలో సేవా గుణమే గొప్పదని మాచిరెడ్డి శ్రీనాథరెడ్డి అన్నారు.మనుబోలులో శ్రీ సేవా నాదం ట్రస్ట్ ఆధ్వర్యం లో ట్రస్ట్ ఫౌండర్ మాచిరెడ్డి శ్రీనాథరెడ్డి తన సొంత నిధులు 14 లక్షలతో తన మేన మామ ఆమంచర్ల దయాకర్ రెడ్డి జ్ఞాపకార్థం నిర్మించిన అంబేద్కర్ నగర ఆర్చిని ఆదివారం రాత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ఫౌండర్ శ్రీనాథ్ రెడ్డి మాట్లాడుతూ తన జీతం లో ఇన్ కామ్ టాక్స్ లో 60 శాతం నిధులను ఇలా సేవా కార్యక్రమాలు ఖర్చు చేస్తున్నానన్నారు. మనం చనిపోయిన తర్వాత మనం చేస్తున్న సేవా కార్యక్రమాలు గుర్తింపు వస్తుందన్నారు. అంబేద్కర్ నగర్ వాసులు అభ్యర్థన మేరకే ఈ ఆర్చిని నిర్మించామన్నారు. దీనివల్ల హరిజనవాడకు అంబేద్కర్ నగర్ గా గుర్తింపు వస్తుందన్నారు. ఆయన చేస్తున్న సేవా కార్యక్రమాలను పలువురు అభినందించారు. అనంతరం గ్రామస్తులకు 3000 జనపనారతో చేసిన సంచులను పంపిణీ చేశారు. 2000 మందికి విందు భోజనం వడ్డించారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ సభ్యులు ముని గిరీష్,గ్రామ పెద్దలు ముంగర విజయ్ భాస్కర్ రెడ్డి,బొమ్మిరెడ్డి హర గోపాల్ రెడ్డి,దాసరి భాస్కర్ గౌడ్,కుడమల వెంకటరమణయ్య,సాని వెంకటరమణయ్య, శివుడు రాజా గౌడ్, దువ్వూరు సుధాకర్ రెడ్డి, ఏలూరు భాస్కర్ రెడ్డి,ఎద్దల ప్రభాకర్ రెడ్డి, పీటర్ పాల్,చలగల దయాకర్, బొల్లు రాంప్రసాద్ శ్రీ సేవానాథం ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

# సర్వేయర్ల సంఘం అధ్యక్షుడుగా లక్ష్మణ్ బాబు

పెళ్లకూరు స్వర్ణసాగరం ఫిబ్రవరి 23.



సూళ్లూరుపేట డివిజన్ గ్రామ సర్వేయర్ల సంఘం నూతన అధ్యక్షుడుగా పల్లమాల లక్ష్మణ్ బాబు ను ఎన్నుకోవడం జరిగింది. నాయుడుపేట రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం గ్రామ సర్వేయర్ల ఉద్యోగుల సంఘం సూళ్లూరుపేట డివిజన్ కమిటీ ఎన్నికలు జరిగాయి. ఈఎన్నికల్లో సూళ్లూరుపేట డివిజన్ గ్రామ సర్వేయర్ల సంఘం అధ్యక్షుడిగా పల్లామాల లక్ష్మణ్ బాబు ఎన్నికయ్యారు. గ్రామ సర్వేయర్ సంఘం డివిజనల్ ఎన్నికల అధికారి విజయ్ ప్రకాష్, సహాయకులు ఎన్నికల అధికారి రాజా ఆధ్వర్యంలో ఈఎన్నికలు నిర్వహించారు. ఈసందర్భంగా లక్ష్మణ్ బాబు మాట్లాడుతూ సర్వేయర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. డివిజనల్ అధ్యక్షుడిగా ఎన్నికైన లక్ష్మణ్ బాబుకు పలువురు ఉద్యోగులు అభినందనలు తెలియజేశారు.

# నేడు శ్రీ కోదండ రామాంజనేయ స్వామి ఆలయ ప్రతిష్ట కుంభాభిషేక మహోత్సవం.

ఎండోమెంట్ ఈవో కె.నవీన్ కుమార్.



స్వర్ణసాగరం (నాయుడుపేట) ఫిబ్రవరి 23.

తిరుపతి జిల్లా నాయుడుపేట మున్సిపాలిటీలోని తుమ్మూరు గ్రామం పాత చెక్ పోస్ట్ వద్ద కలిసి ఉన్న శ్రీ కోదండ రామాంజనేయ స్వామి ఆలయం ప్రతిష్ట కుంభాభిషేక మహోత్సవం మంగళవారం నుండి గురువారం వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఎండోమెంట్ ఈవో కె నవీన్ కుమార్ ఒక ప్రకటనలో తెలియజేశారు. 24వ తేదీ మంగళవారం ఆలయంలో నూతనంగా నిర్మించిన శిఖర,శ్రీ అభయాంజనము,భక్తాంజనము, వీరాంజనము విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం భక్తిశ్రద్ధలతో అత్యంత వైభవంగా జరుగుతుందని తెలిపారు.శ్రీ కోదండ రామాంజనేయ స్వామి ఆలయంలో భక్తులచే నూతనంగా నిర్మించిన శిఖర కోష్ఠ దేవతల ప్రతిష్ట కుంభాభిషేకం మహోత్సవ కార్యక్రమంలో పట్టణ ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# గౌడమాల గ్రామంలో ఉద్రిక్తత,

## 50 ఏళ్ల రోడ్డుకు అడ్డంగా గోడ -- పోలీసుల మధ్య నిర్మాణం,

## కంపెనీ--అధికారుల తీరుపై ప్రజల ఆగ్రహం,



స్వర్ణసాగరం -తొట్టంబేడు,

తొట్టంబేడు మండలంలోని గౌడమాల గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కజేరియా కంపెనీ ఆధ్వర్యంలో, ప్రభుత్వ అధికారుల సమక్షంలో గ్రామానికి దారి దశాబ్దాలుగా ఉపయోగిస్తున్న రహదారికి అడ్డంగా గోడ నిర్మించడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.గ్రామానికి ప్రధాన మార్గంగా ఉన్న ఈ రహదారి ద్వారా సచివాలయం, రేషన్ దుకాణం, పంచాయతీ కార్యాలయాలకు ప్రజలు రాకపోకలు సాగించేవారని తెలిపారు. సుమారు 50--60 సంవత్సరాలుగా ఉన్న దారిని ఒక్కసారిగా మూసివేయడం అన్యాయమని గ్రామస్తులు ఆరోపించారు.పోలీసుల బందోబస్తు మధ్య గోడ నిర్మాణం చేపట్టినట్లు గ్రామస్థుల ఆరోపణ. ముఖ్యంగా ఎస్సీ వర్గాలకు చెందిన కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, ప్రత్యామ్నాయ మార్గం లేక రోజువారీ పనులు సైతం కష్టంగా మారాయని వాపోతున్నారు."ఏళ్ల తరబడి ఉన్న రోడ్డును ఒక్కరోజులో ఎలా మూసివేస్తారు?" అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. సమస్యపై అధికారులు స్పందించి వెంటనే పరిష్కారం చూపాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

# మా నాయకుడు జోలికి వస్తే ఊరుకోం...

## టీడీపీ అధ్యక్షులు పొన్నూరు రామకృష్ణయ్య.ఏ. యం. సి. చైర్మెన్ గాలి రామకృష్ణా రెడ్డి.వి.వెంకట రమణ రెడ్డి.రాజా గౌడ్.సాని. విజయ్ రెడ్డి. కిరణ్.

స్వర్ణ సాగరం, మనుబోలు :

మాజీ మంత్రి నెల్లూరు జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి చేసే కుట్రలు సాగనివ్వమని తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సొసైటీ చైర్మన్ పొన్నూరు రామకృష్ణయ్య వార్నింగ్ ఇచ్చారు. మండల కేంద్రమైన మనుబోలు కోదండ రామపురం సీఆర్ఆర్ కళ్యాణమండపంలో సోమవారం ఉదయం మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి ఆదివారం పొట్టేలు కలవ వద్దచేసిన ఆరోపణలు మాట్లాడిన తీరుకు టీడీపీ శ్రేణులుసోమవారం కౌంటర్ ఇచ్చారు. ముందుగా అధ్యక్షులు పొన్నూరు రామకృష్ణ మాట్లాడుతూ కాకాణి గోవర్ధన్ రెడ్డి మాటలను చర్యలను ఎండగట్టారు. మా ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పైన ఆయన చేస్తున్న ఆరోపణలను తిప్పి గొట్టారు. పొట్టేళ్ల కాలువ చెక్ డ్యామ్ దగ్గరకు వచ్చి ఎమ్మెల్యే కోట్లు తినేశాడని కాకాణి మాట్లాడారని ఇది ఎంత దారుణం అంటే స్టేట్ డిజస్టర్ ఫండ్ మేనేజ్మెంట్ మా టీడీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత చేసుకున్న బిల్లులు రూ 2కోట్లు ప్రభుత్వం విడుదల చేసింది. మా కార్యకర్తలు నాయకులు కాలువలు రిపేర్లు చేస్తే వాళ్లను నాశనం చేయాలని కాకాణి కుట్ర పూరిత ఆరోపణలు చేస్తున్నాడని పొన్నూరు రామకృష్ణయ్య ఆరోపించారు. కనుపూరు కాలువ సర్వే పల్లి కాలవలకు ఏడు కోట్లు దొంగ బిల్లులు పెట్టుకుని డ్రా చేసుకునేందుకు కాకాని కోర్టుకు వెళ్లి తెచ్చుకున్నాడని ఆ బిల్లు ఇప్పుడు విడుదలయితే టీడీపీ ప్రభుత్వంలో అక్రమాలు జరిగాయనే మాపైన అబండాలు వేయడానికి కాకానికి గోవర్ధన్ రెడ్డికుట్రలో ప్రయత్నమే ఇది అని పొన్నూరు రామకృష్ణయ్య చెప్పారు. వాళ్ల దొంగ బిల్లులు చేసుకుని మా పైన అబండాలు వేసే ప్రయత్నం ఏమిటని ఇలాంటి ప్రయత్నాలను తిప్పికొడతామని చెప్పారు . ఇక జగనన్న కాలనీలో వైకాపా ప్రభుత్వంలో పదివేల తో బేస్ మట్టాలు నిర్మించి రూ 70.000 బిల్లు తీసుకున్నారని పొన్నూరు రామకృష్ణయ్య తెలిపారు. ఇపుడు ఆ బిల్లులు క్లియర్ కావాలని దానికి కూడా సోమిరెడ్డి అడ్డు పడుతున్నాడనేచెప్పే ప్రయత్నం కాకాణి పూను కుంటాడని పొన్నూరు తెలిపారు మా ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి తెలుగు గంగ జలాశయంలో 10.30 టీఎంసీలు నీళ్లు ఉంటే ఆరుతడి పంటలుకు సాగు నీరు ఇప్పించి పండించిన గొప్ప నాయకుడని రామకృష్ణ య్య కితాబునిచ్చారు. అదే నువ్వు మంత్రిగా ఉండి 16 టీఎంసీలు నీళ్లు ఉంటే నార్లు పోయొద్దని చేతులెత్తేసావాని రామకృష్ణయ్య మండిపడ్డారు. 84 రోజులు జైల్లో ఉన్న జీవితంలో మార్పు లేదని.. ఇలాగే ఆవాకులు చవాకులు పేలి తే తీవ్ర పరిణామాలు ఉంటాయని వార్నింగ్ ఇచ్చారు. ఏం సి చైర్మన్ గాలి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నావు మా నాయకుడు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డికి విదేశాల్లో 1000 కోట్లు ఆస్తులు ఉన్నాయని ఆరోపించావు. మీ ప్రభుత్వంలో నిరూపించలేకపోయావు నీటి సంఘం అధ్యక్షులు ఒక్క రూపాయి బిల్లు రాలేదు టెక్నికల్ మంజూరు కూడా కాలేదు అప్పుడే మా ఎమ్మెల్యే చంద్రమోహన్ రెడ్డి కోట్ల రూపాయలు తిన్నాడని ఆవాకులు చవాకులు మాట్లాడుతున్నావు తిన్నది నువ్వు అక్రమాలు చేసింది నువ్వు 85 రోజులు జైల్లో దేనికున్నావు ఏమి చెస్తే జైలుకు వెల్లావు.తప్పు చేసి జైలుకు పోయింది నువ్వు. మా నాయకుడు చంద్రమోహన్ రెడ్డి 2029 సంవత్సరంలో మళ్ళీ చిత్తుచిత్తుగా నన్ను ఓడిస్తాడు అంటూ గాలి రామకృష్ణారెడ్డి మండిపడ్డారు. అసత్యాలు మాట్లాడితే బాగుండదు. సాగు నీరు రావని 2017 సంవత్సరంలో గ్రామాల్లో దండోర వేయించావు అదే మా నాయకుడు పొలాలకు నీళ్లు ఇచ్చి పంటలు పండించాడని. గుర్తు చేశారు. కనుపూరు కాల్వ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ వర్దినేని మస్తాన్ నాయుడు మాట్లాడుతూ సాగు నీటి ఏద్దడి దృష్టిలో పెట్టుకుని పొట్టేలు కాలువ నుండి లిఫ్ట్ ద్వారా నీరు ఇచ్చే ప్రయత్నాలు చేస్తుంటే లేనిపోని ఆరోపణలు చేస్తున్నావు. రాజోలు పాడు గ్రామంలో ఐదు సంవత్సరాలక్రితం జరిగిన విషయాన్ని ఆరోపణలు ఇప్పుడు చేయడం తగదని ఆనాడు లిఫ్ట్ ద్వారా నీళ్లు ఇవ్వకపోతే రైతులు ఆనాడు పంటలు పండించుకునే పరిస్థితి లేదని ఈ విషయాన్ని గోవర్ధన్ రెడ్డి తెలుసుకోవాలని. చెప్పారు. 2019 నుండి 2024 మధ్యలో అక్కంపేట చెరువులో 16 లక్షలు కొమ్మలపూడి పొట్టేల కాలువ 24 లక్షల్లో జెసిబి పెట్టకుండానే బిల్లులు చేసుకున్న ఘనుడవని మస్తాన్ నాయుడు ఆరోపించారు కనుపూరు కాలువలో రెండు కోట్లు బిల్లు రావాల్సి ఉంటే ఒక కోటి విడుదలయని మస్తాన్ నాయుడు చెప్పారు. అసలు కాలువలు రిపేర్లకు ఎమ్మెల్యేకి ఏం సంబంధం అని మస్తాన్ నాయుడు ప్రశ్నించారు. రైతులు నీటి సంఘం అధ్యక్షులు చైర్మన్లు అయితే ఎమ్మెల్యేని పైన అబండాలు వేయడం ఏమిటని మస్తాన్ నాయుడు నిలదీశారు. మీకు ఎలాంటి అనుమానం ఉన్న మీ వాళ్ళని పంపిస్తే నిరూపిస్తామని మస్తాన్ నాయుడు తెలిపారు. గ్రీన్ కంట్రీ వద్ద 2024 పొలాల్లో ఎల్లవు గుర్రైతే 20 ఎకరాలు పంటపాచి పోతే విత్తనాలు కూడా ఇవ్వలేని నువ్వు మా నాయకుడిని విమర్శించడం తగదని కాగితాల పూరు నీటి సంఘం అధ్యక్షులు వెడిచర్ల వెంకటరమణారెడ్డి ఖండించారు. 2018 సంవత్సరంలో కాగితాలపూరు గ్రామాల్లో రెండు దఫాలు పూర్తిగా ఎండిపోతే ఆరోజు నువ్వు ఎమ్మెల్యే ఉండి కూడా ఏమీ చేయలేకపోయావని పంట చివరి దశలో కూడా నీళ్లు ఇవ్వలేని పరిస్థితిలో నువ్వు ఉన్నావని రమణారెడ్డి విమర్శించారు. మనుబోలు చెరువు పిడూరు చెరువు పూర్తిగా నిండితేనే సైపన్ల ద్వారా నీళ్లు మా గ్రామాలచెరువులు కు వస్తాయని విషయాన్ని తెలుసుకోకుండా మాట్లాడటం తగదని రమణారెడ్డి హితవు చెప్పారు. వైసిపి నాయకులు మీరు అడగండి మేము చేసే పని అక్రమైతే సక్రమంగా లేకపోవడం అన్యాయం అయితే దేనికైనా సిద్ధమని బురదజల్లే మాటలు వద్దని రమణారెడ్డి వారించారు. డ్యామ్ లో నీళ్లు ఉంటే ఇక్కడ రెండు చెరువు నిండితేనే సైఫెన్ ద్వారా నీళ్లు వస్తాయని నెల టైం పడుతుందని ఈ విషయం మీకు అర్థం కాకపోవడం ఏమిటని తెలుసుకొని మాట్లాడాలని రమణారెడ్డివిజ్ఞప్తి చేశారు. మా ఎమ్మెల్యే చంద్రమోహన్ రెడ్డికృషి తోనే మా పంటలు పండించుకునే ప్రయత్నం చేస్తున్నామని లిఫ్ట్ లో నిధులు స్వాహా చేయలేదని రమణారెడ్డి ఖండించారు ఇకమీదట ప్రతి విషయం తెలుసుకొని మాట్లాడాలని రమణారెడ్డి విజ్ఞప్తి చేశారు. మనుబోలు మాజీ నీటి సంఘ అధ్యక్షులు ముంగర విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ. వీరంపల్లి బేరి వద్ద తాను వైకాపా ప్రభుత్వంలో రెండు జెసిబిలు పెట్టి మరమ్మతులు చేస్తే బిల్లు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాను టిడిపిలో పనిచేస్తే వైసిపిలో బిల్లు ఎందుకు రాలేదని ప్రశ్నించారు. రాయపాటి కిరణ్ కుమార్ మాట్లాడుతూ. మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి అవగాహన లేకుండా మాట్లాడుతున్నాడని ఆరోపించారు. మనుబోలు నీటి సంఘద్వారా 10 లక్షల్లో చేస్తే ఒక్క రూపాయి బిల్లు రాలేదని గుర్తు చేశారు. మా నాయకుడు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డికి సంస్కారం ఉందని తప్పులు చేయరని ఈ సందర్భంగా కిరణ్ చెప్పారు. నక్కల కాలవ లో ఏడు కోట్లు పనులు చేయకుండా బిల్లు చేసుకునే విషయాన్ని గుర్తు చేశారు. అధికారులను భయపెట్టి ప్రలోభ పెట్టి బెదిరించి వైకాపా ప్రభుత్వంలో దారుణమైన పరిస్థితులు చూసామని కిరణ్ విమర్శించారు. మనుబోలు టీడీపీ టౌన్ మాజీ అధ్యక్షులు సాని వెంకటరమణయ్య మాట్లాడుతూ కోదండరాంపురంలో ఎన్టీఆర్ విగ్రహం పెడితే కోర్టుకెళ్లి ఆపిన ఘనుడు వని ఆరోపించారు. నువ్వు ఎంత అవినీతిపరుడువో అందరికీ తెలిసిన అని నువ్వు మాకు పాఠాలు నేర్పాల్సిన అవసరం లేదని హితవు చెప్పారు. ఈ ప్రెస్ మీట్ లో టీడీపీ నాయకులు.మాజి సర్పంచ్ వెందోటి భాస్కర్ రెడ్డి(జట్ల కొండూరు )రవి రెడ్డి.ఏళ్ల యానాది నాయుడు.(రాజోలు పాడు )రావుల జీతేంద్ర. గుంజి సతీష్ (యాచవరం) తదితరులు పాల్గొన్నారు.



# గ్రీవెన్స్ డే కు పలు శాఖల అధికారులు డుమ్మా

## - ఇబ్బందులు ఎదుర్కొంటున్న అర్జీదారులు

పెళ్లకూరు స్వర్ణసాగరం ఫిబ్రవరి 23.

మండల రెవెన్యూ కార్యాలయంలో సోమవారం జరిగిన గ్రీవెన్స్ డే కు పలు శాఖల అధికారులు డుమ్మా కొట్టడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రతి సోమవారం మండల స్థాయిలో మండల స్థాయి అధికారులందరినీ ఒక్కచోట సమకూర్చి తద్వారా ప్రజా విజ్ఞప్తుల దినం నిర్వహించి ప్రజా సమస్యలను పరిష్కరించే దిశగా కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రీవెన్స్ డే కి గత కొంతకాలంగా పలు శాఖల అధికారులు డుమ్మా కొట్టడంతో తూ తూ మంత్రంగా కొనసాగుతుంది. ముఖ్యంగా మండలంలోని పలు ప్రాంతాల్లో ఎక్కువ మంది రైతులు వరి తరువాత వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలు, నిమ్మ సాగు చేస్తున్నారు. అయితే సంబంధిత ఉద్యానవన శాఖ అధికారులు రైతులకు అందుబాటులో లేకపోవడం వల్ల ఉద్యాన పంటలు ఆశించిన ఫలితాలు ఇవ్వడం లేదని స్థానికులు అంటున్నారు. ఉద్యానవన శాఖ అధికారులు వారానికి ఓసారి జరిగే గ్రీవెన్స్ డే కి, మూడు నెలలకు ఒకసారి జరిగే సర్వసభ్య సమావేశానికి కూడా హాజరు కాకపోవడంతో ఇక్కడ రైతులకు తిప్పలు తప్పడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యాన పంటల సాగుపై అనేక రాయితీలు అందిస్తున్నప్పటికీ ఇక్కడ అవగాహన చేసే అధికారులు దీర్ఘకాలికంగా అందుబాటులో లేకపోవడంతో రైతులు అల్లాడుతున్నారు. అదేవిధంగా మండలంలో ఆర్ అండ్ బి అధికారులు అందుబాటులో లేక గ్రామీణ జనం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చెంబేడు- పునబాక, కొణతనేరి- కోనేటి రాజుపాలెం ఆర్ అండ్ బి రహదారులు అధ్వానంగా ఉన్నాయి. ఇక్కడ సమస్యలను చెప్పుకోవడానికి గత రెండేళ్లుగా ఆ శాఖ అధికారులు అందుబాటులో లేకపోవడంతో ప్రజలు కష్టాలు పడుతున్నారు. అలాగే మేకలు, గొర్రెలు, గేదెలు, ఆవులు మేపుకుంటూ జీవనం సాగించే పాడి రైతులు మూగజీవాలకు వచ్చే రోగాల పట్ల అవగాహన లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పశుసంవర్ధక శాఖ అధికారులు సిబ్బంది రైతులకు అందుబాటులో లేకపోవడం వల్ల పాడే రైతులు కష్టాలు వర్ణనాతీతంగా మారింది. అదేవిధంగా నీటిపారుదల శాఖ, విద్యుత్ శాఖ, ఉపాధి హామీ శాఖలకు సంబంధించి ఇన్చార్జిలో బాధ్యతల వల్ల స్థానికులకు తిప్పలు తప్పడం లేదు. కొందరు ముఖ్యమైన శాఖ అధికారులకు మండల కేంద్రమైన పెళ్ళకూరులో ప్రభుత్వ కార్యాలయాలు ఎక్కడ ఉన్నాయో కూడా తెలియని దుస్థితి నెలకొన్నది. గత ఐదేళ్లుగా జాతీయ రహదారి రోడ్డు విస్తరణ అభివృద్ధి పనుల కోసం తీసుకున్న భూములకు సంబంధించి భూ నిర్వాసితులకు పరిహారం చెల్లించ కపోవడంపై మండల స్థాయిలో ఏ అధికారి కూడా పూర్తి స్థాయిలో పనిచేసిన దాఖలాలు కనబడటం లేదు. దాంతో ఇప్పటికీ నిర్వాసితులు మండల రెవెన్యూ కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు కాళ్లు అరిగేలా తిరుగుతున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి నిర్లక్ష్యంగా వ్యవహరించే మండల స్థాయి అధికారులపై కొరడా జులుపించాలని స్థానికులు కోరుతున్నారు.



# అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి,

## - మండల కేంద్రంలో రిలే నిరాహార దీక్షలు ప్రారంభం,

## హామీలు అమలు చేయకపోతే ఆందోళనలు ఉధృతం -- సీఐటీయూ,

స్వర్ణసాగరం -తొట్టంబేడు,

తొట్టంబేడు మండలంలోని అంగన్వాడీ కార్యకర్తల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం సోమవారం మండల కేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు ప్రారంభమ య్యాయి.ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్య మాట్లాడుతూ, ఎన్నికల ముందు అంగన్వాడీల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20 నెలలు గడిచినా అమలు చేయకపోవడం బాధాకరమని విమర్శించారు. పల్లె--పట్టణం తేడా లేకుండా శిశు పోషణ, బాలల ఆరోగ్యం, గర్భిణీ స్త్రీల సంరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న అంగన్వాడీ కార్యకర్తలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్నారు.గతంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ కాలంలో 42 రోజుల దీక్షలు నిర్వహించిన సమయంలో ప్రతిపక్షంలో ఉన్న తెలుగుదేశం పార్టీ నాయకులు అధికారంలోకి రాగానే అన్ని సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఇప్పుడు ఆ హామీలను అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.సుప్రీంకోర్టు తీర్పు మేరకు "సమాన పనికి సమాన వేతనం" అమలు చేసి ప్రతి అంగన్వాడీ కార్యకర్తకు నెలకు రూ.26 వేల వేతనం ఇవ్వాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, మినీ అంగన్వాడీ కేంద్రాలను మెయిన్ సెంటర్లుగా అప్గ్రేడ్ చేయాలని డిమాండ్ చేశారు.డిమాండ్లను వెంటనే పరిష్కరించకపోతే ఈనెల 25, 26, 27 తేదీలలో జిల్లా కలెక్టర్ కార్యాలయాల ఎదుట కూడా రిలే దీక్షలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు గంధం మణి, రాజా, రేవతి, పుష్ప, సక్కుబాయి, అలాగే ఐ ఎఫ్ టి యు నాయకులు జాకీర్, కల్పన తదితరులు పాల్గొన్నారు.




స్వర్ణసాగరం





## విజయ్ సేతుపతి-సాయిపల్లవి కాంబో వచ్చేస్తుంది.. వివరాలివే

మణిరత్నం సినిమాలంటే క్రేజ్ ఎలా ఉంటుందో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఈ స్టార్ డైరెక్టర్ కాంపౌండ్ నుంచి రొమాంటిక్ డ్రామా రాబోతున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాను మణిరత్నం ముందుగా శింబుతో కానీ ధ్రువ్ విక్రమ్‌తో కానీ అంతా చేస్తాడనుకున్నారు. కానీ అనూహ్యంగా ఈ ప్రాజెక్ట్ కోలీవుడ్ స్టార్ యాక్టర్ విజయ్ సేతుపతి చేతిలోకి వెళ్లింది. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ఆసక్తికర కథనాలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఇందులో సాయిపల్లవి హీరోయిన్‌గా నటించనుంది. తాజా టాక్ ప్రకారం ఇప్పటికే ఏఆర్ రెహమాన్ టీం కొన్ని ట్రాక్స్ కూడా కంపోజ్ చేసిందట. విజయ్ సేతుపతి ప్రస్తుతం చేస్తున్నసినిమాలు పూర్తవగానే.. మణిరత్నం ఈ సినిమాను సెట్స్‌పైకి తీసుకెళ్లేందుకు రెడీ అవుతున్నట్టు సమాచారం. త్వరలోనే ఈ మూవీ అధికారిక ప్రకటన కూడా ఉండబోతుందట. 2025లో థగ్‌లైఫ్ సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చిన మణిరత్నానికి ఈ మూవీ భారీ నిరాశనే మిగిల్చింది. విజయ్ సేతుపతి ప్రస్తుతం జైలర్ 2తోపాటు పలు సినిమాలను లైన్‌లో పెట్టాడు. సాయిపల్లవి జుని ఱఱఅతోపాటు ధనుష్‌తో ఱ55, రామాయణ పార్ట్ 1, రామాయణ పార్ట్ 2లలో నటిస్తోంది.




## నాని 'ది ప్యారడైజ్' టైటిల్ సాంగ్ ప్రోమో

నాని కొత్త సినిమా 'ది ప్యారడైజ్' నుంచి టైటిల్ సాంగ్ ప్రోమో వచ్చేసింది. ఆయా షేర్... అంటూ వందలాదిమంది డ్యాన్సర్లతో నాని వేసిన స్టెప్పులకు అదిరిపోయేలా అనిరుధ్ రవిచందర్ సంగీతం ఉంది. కాసర్ల శ్యామ్ కుమార్ రచించిన ఈ పాటను అడ్డుల జంగిరెడ్డి, ఆకునూరి దేవయ్య, అనిరుధ్ రవిచందర్ ఆలపించారు. ఫిబ్రవరి 24న పూర్తి సాంగ్‌ను విడుదల చేస్తామని ప్రోమోలో ప్రకటించారు. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల తెరకెక్కిస్తున్న ఈ మూవీలో మోహన్‌బాబు, సంపూర్ణేశ్‌బాబు, రాఘవ్ జుయల్, సోనాలి కులకర్ణి నటిస్తున్నారు. భారతీయ భాషలతోపాటు ఇంగ్లిష్, స్పానిష్‌లో ఆగష్టు 21న ఈ మూవీ విడుదల కానుంది. పీరియాడిక్ యాక్షన్ డ్రామాతో రూపొందుతున్న ఈ చిత్రంలో నాని ఒక ప్రేత్యకమైన గెటప్‌లో కనిపించనున్నారు. మొదటి సాంగ్ సినిమాకి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని చిత్రవర్గాలు ఇప్పటికే తెలిపాయి.

## నేచురల్ స్టార్ సరసన బాలీవుడ్ బ్యూటీ?

నేచురల్ స్టార్ నాని వరుస క్రేజీ ప్రాజెక్ట్‌లతో ఫుల్ బిజీగా ఉన్నారు. ప్రస్తుతం ఆయన శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'ది ప్యారడైజ్' అనే హై-వోల్టేజ్ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో నటిస్తున్నారు. ఇదే కాంబినేషన్‌లో వచ్చిన 'దసరా' బ్లాక్‌బస్టర్ హిట్ కావడంతో ఈ కొత్త ప్రాజెక్ట్‌పై అంచనాలు భారీగా పెరిగాయి. 'ది ప్యారడైజ్'లో నాని పూర్తిగా కొత్త గెటప్‌లో, ఊర మాస్ క్యారెక్టర్‌లో కనిపించనున్నట్లు సమాచారం. ఈ పాత్ర కోసం ఆయన తన లుక్‌ను పూర్తిగా మార్చుకోవడం విశేషం. రగ్డ్ స్టైల్, ఇంటెన్స్ బాడీ లాంగ్వేజ్‌తో నాని మరోసారి మాస్ ఆడియన్స్‌ను టార్గెట్ చేస్తున్నాడని టాక్ వినిపిస్తోంది. 'దసరా'లో చూపించిన రా ఎనర్జీకి మించి ఈసారి మరింత పవర్‌ఫుల్ ప్రెజెన్స్ ఉంటుందని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు, 'ఓజీ' ఫేమ్ సుజీత్ దర్శకత్వంలో నాని ఓ స్టైలిష్ యాక్షన్ డ్రామాకు శ్రీకారం చుట్టాడు. ఈ చిత్రానికి 'బ్లడీ రోమియో' అనే టైటిల్ ఖరారు చేసినట్లు ఇండస్ట్రీలో ప్రచారం జరుగుతోంది. నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై రూపొందుతున్న ఈ మూవీ, సుజీత్ సినిమాటిక్ యూనివర్స్ (ూజఖ)లో భాగమని సమాచారం. ఈ కాంబినేషన్ ప్రకటించగానే అభిమానుల్లో భారీ ఎగ్జైట్మెంట్ నెలకొంది. ఈ ప్రాజెక్ట్‌లో హీరోయిన్‌గా బాలీవుడ్ సెన్సేషన్ తృప్తి డిమ్రీ పేరును పరిశీలిస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే ఆమె సందీప్ రెడ్డి వంగా- ప్రభాస్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న స్పిరిట్‌లో నటిస్తోంది. ఒకవేళ 'బ్లడీ రోమియో'లో కూడా ఆమె ఓకే అయితే, ఇది ఆమెకు రెండో తెలుగు సినిమా అవుతుంది. 'యానిమల్ ' చిత్రంతో నేషనల్ క్రష్‌గా గుర్తింపు తెచ్చుకున్న త్రిప్తి, నాని సరసన నటిస్తే ఆ ప్రాజెక్ట్‌కు మరింత క్రేజ్ రావడం ఖాయం అంటున్నారు సినీ విశ్లేషకులు.



## శ్రీలీలని పలకరిస్తున్న వరుస ఫ్లాపులు.. అయినా.. స్టార్ హీరో సరసన ఛాన్స్!

సౌత్ ఇండస్ట్రీలో యంగ్ హీరోయిన్లలో అచ్చ తెలుగమ్మాయిగా గుర్తింపు తెచ్చుకున్న శ్రీలీల వరుస అవకాశాలతో దూసుకుపోతోంది. ఎనర్జీ, డ్యాన్స్, స్క్రీన్ ప్రెజెన్స్‌తో తక్కువ సమయంలోనే ఆమె మంచి గుర్తింపు సంపాదించింది. రవితేజతో చేసిన ధమాకా ద్వారా తెలుగులో తొలి భారీ హిట్ అందుకున్న ఈ బ్యూటీ, హిట్లు--ఫ్లాపులతో సంబంధం లేకుండా వరుసగా ఛాన్సులు దక్కించుకుంటూ బిజీగా మారింది. తన టాలెంట్‌తో నిర్మాతల దృష్టిని ఆకర్షిస్తూ కమర్షియల్ సినిమాల్లో ప్రత్యేక ఇమేజ్‌ను నిర్మించుకుంది. టాలీవుడ్‌లో స్టార్ హీరోల సరసన నటించిన శ్రీలీల, మాస్ ఎంటర్‌టైనర్ల నుంచి లవ్ స్టోరీల వరకు విభిన్న కథలను ఎంచుకుంటూ కెరీర్‌ను విస్తరించుకుంటోంది. ఇదే సమయంలో కోలీవుడ్‌పైనా దృష్టి సారించింది. శివకార్తికేయన్ హీరోగా తెరకెక్కిన పరాశక్తి చిత్రంతో తమిళ ప్రేక్షకులకు పరిచయమైన ఆమె, అక్కడ కూడా అవకాశాలు అందుకుంటోంది. ఇక తాజాగా ధనుష్ హీరోగా రాజ్ కుమార్ పెరియాసామి దర్శకత్వంలో రూపొందుతున్న 'ఱ55' (వర్కింగ్ టైటిల్) ప్రాజెక్ట్‌లో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ చిత్రాన్ని వండ్ బార్ సంస్థ నిర్మిస్తోంది. ఇందులో సాయి పల్లవి కూడా కీలక పాత్రలో కనిపించనుండటం ఆసక్తిని పెంచుతోంది. ఈ సినిమా ద్వారా కోలీవుడ్‌లో తన స్థానం మరింత బలపరచుకోవచ్చని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఇదిలా ఉంటే, ఇప్పుడు మరో క్రేజీ ప్రాజెక్ట్ విషయంలో శ్రీలీల పేరు గట్టిగా వినిపిస్తోంది. తమిళ స్టార్ అజిత్ కుమార్ హీరోగా తెరకెక్కనున్న కొత్త చిత్రంలో ఆమె హీరోయిన్‌గా ఎంపికయ్యే అవకాశముందని టాక్ నడుస్తోంది. 'గుడ్ బ్యాడ్ అగ్లీ' తర్వాత రేసింగ్‌పై దృష్టి పెట్టిన అజిత్, అదే చిత్ర దర్శకుడు అధిక్ రవిచంద్రన్ తో మరోసారి చేతులు కలపబోతున్నట్లు సమాచారం. ఈ ప్రాజెక్ట్ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందనుందని చెబుతున్నారు. ఈ సినిమాలో అజిత్‌కు సమానంగా బలమైన మహిళా పాత్ర ఉండేలా కథను డిజైన్ చేస్తున్నారని కోలీవుడ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఆ పాత్ర కోసం శ్రీలీల పేరును పరిశీలిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఒకవేళ ఈ కాంబినేషన్ కుదిరితే, శ్రీలీల కెరీర్‌లో ఇది కీలక మైలురాయిగా మారే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే ఈ విషయంపై చిత్ర బృందం నుంచి ఇంకా అధికారిక ప్రకటన వెలువడలేదు. అయినప్పటికీ సోషల్ మీడియాలో అజిత్--శ్రీలీల కాంబినేషన్‌పై చర్చలు జోరుగా సాగుతున్నాయి.

